Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 294 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 12 నవంబర్ 2023 | ఆదివారం | పేజీలు : 4

## సీబీఐ.. స్వయం ప్రతిపత్తి సంస్థ

### సర్కారు నియంత్రణ, ప్రభావం ఏమీ ఉండవు: కేంద్రం

న్యూఢిల్లీ : సీబీఐపై తమ నియంత్రణ ఏమీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది కేంద్ర ప్రభుత్వ విభాగమేమీ కాదని తెలిపింది. కేసుల నమోదు, దర్యాప్తు, ప్రాసిక్యూషన్ల విషయమై తమ కంట్రోల్ ఏమీ ఉండదని పేర్కొంది. అది స్వయంప్రతిపత్తిగల సంస్థ అని, దానికి ఓ బాస్ ఉంటారని తెలిపింది. కేంద్ర ప్రభుత్వంపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యంపై సమాధానం ఇస్తూ ఈ విషయాలను తెలిపింది. సీబీఐకి తాము అనుమతులు నిరాకరించినా, తమకు తెలియకుండానే కేసులు నమోదు చేస్తోందని పేర్కొంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దావా వేసింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనలపై సీబీఐ కేసులు నమోదు చేయడాన్ని ప్రశ్నించింది.

# పూర్వవైభవం దిశగా...

# 'హస్తవాసి' బాగున్నట్లేగా...!





## కనీ వినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ టిక్కెట్ల కోసం పోటీ!

## కొందరు సఫలీకృతులైతే... మరికొందరికి నామినేటెడ్ హామీలు!!

హైదరాబాద్ : కాంగ్రెస్ గాలి వీస్తోంది అక్కడ. అలా ఇలా కాదు జంఝామారుతం వీస్తోంది. కాంగ్రెస్ పార్టీకి పూర్వపు వైభోగం వచ్చింది అని అంతా భావిస్తున్నారు. అధికారం అన్నది నిన్నటి మాట అని రేపటి కల అని కాడె వదిలేసి దిగాలు పడిన చోట మా పొలంలో కూడా విత్తనాలు మొలుస్తున్నాయి అన్నంత సంబరంగా ఇపుడు కాంగ్రెస్ గాలి వీస్తోంది. ఆ వ్యవసాయ క్షేత్రమే కాంగ్రెస్. ఆ రాష్ట్రమే తెలంగాణా. దానికి రుజువులు కావాలా అంటే కావాలని అనుకున్న వారికి బోలెడు ఉదాహరణలు కళ్ళ ముందు కనిపిస్తాయి. కాంగ్రెస్ లో టికెట్ల కోసం ఇంతటి పోరు ఎపుడైనా చూశారా. వారూ వీరూ కాదు అందరూ పోలోమంటూ ఢిల్లీకి వెళ్లిపోతున్నారు. హై కమాండ్ ని ఎలాగో కలసి బతిమాలో బామాలో టికెట్ తెచ్చుకుంటే చాలు అధికార పార్టీ ఎమ్మెల్యే అయినట్లే అని అన్నట్లు హస్తిన బాటపట్టి కొందరైతే సఫలీకృతులయ్యారు. మరికొందరు నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ పదవులకు హామీలు తెచ్చుకున్నారు. ఇక కాంగ్రెస్ తెలంగాణా ఇచ్చింది. కానీ ప్రత్యేక రాష్ట్రం అయ్యాక మాత్రం ఆ ఫలాలను ఎంజాయ్ చేయలేదు. ఇది నిజంగా అత్యంత బాధాకరమైన అంశమే. కాంగ్రెస్ పార్టీ ఒకటి కాదు రెండు ఎన్నికల్లో ఓడిపోయింది. ఇక కాంగ్రెస్ పని సరి అనుకున్న వేళ ఇపుడు దానికి విరుద్ధంగా అద్భుతాలే జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాయలు కాచిన వారు అలా ఉండగానే వారిని తోసుకుంటూ చాలా మంది గేట్లు తీసుకుని మరీ కాంగ్రెస్ లోకి వచ్చేస్తున్నారు. జాయిన్ అయిపోతున్నారు. టికెట్ కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ టికెట్ కి ఎంతటి డిమాండ్ అంటే మొదటి జాబితా రిలీజ్ అయ్యాక రెండవ జాబితా కోసం కళ్ళలో వత్తులు వేసుకుని చూస్తున్నారు. ఇక కాంగ్రెస్ కి వచ్చిన ఈ అనుకూల గాలిని చూసి కాంగ్రెస్ పెద్దలు స్క్రీనింగ్ కమిటీ బాధ్యులు మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నారు. కాంగ్రెస్ కి వచ్చిన ఆ సానుకూలతను ఎలాంటి పొరపాట్లు లేకుండా సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారు. అందుకే ఆచీ తూచీ అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. బెటరెస్ట్ ఆఫ్ ద బెటర్ అన్న లెక్కన వడపోతలు చేస్తూ పోతున్నారు. కాంగ్రెస్ జాబితాలో తమ పేరు కోసం చాలా మంది హస్తిన బాటలో ఉన్నారు. ఇక కాంగ్రెస్ లో ఇంతటి ఉత్సాహపూరితమైన వాతావరణం ఉంటే ప్రత్యర్థి పార్టీలు కూడా ఉలిక్కిపడుతున్నాయి. కొద్ది నెలల క్రితం వరకూ అంతా తామే అన్నీ తామే అని అనుకున్న బీజేపీ అయితే జనసేన తోడు కావాలని అంటోంది. జనసేనకు తెలంగాణాలో ఎన్ని ఓట్లు ఉన్నాయన్నది తెలియకపోయినా ఏ కొద్ది ఓట్లు వచ్చినా తమకు లాభమే అన్నట్లుగా ఆ పార్టీని అక్కున చేర్చుకుంటోంది. ఇంకో వైపు బీయారెస్ అధినాయక త్రయం కాంగ్రెస్ నోటి నుంచి ఏ చిన్న ప్రకటన వచ్చినా దానికి ధీటుగా రియాక్ట్ అవుతోంది. కాంగ్రెస్ వస్తే తెలంగాణాలో ఏమీ మిగలదు అని బీయారెస్ హై కమాండ్ జనాలను హెచ్చరిస్తోంది. కాంగ్రెస్ లో ఎంతమంది సీఎం లు ఉంటారు అని కూడా హరీష్ రావు ప్రశ్నిస్తున్నారు. ఇక సీఎం ల దాకా వచ్చారు అంటే బీయారెస్ కి కూడా కొంత మ్యాటర్ తెలిసి ఉందా అన్న చర్చ అయితే సాగుతోంది.

ఏది ఏమైనా హస్తం పార్టీకి ఇది మంచి శకునంగానే చూస్తున్నారు. డిసెంబర్ 3 తరువాత కాంగ్రెస్ దే అధికారం అని ఆ పార్టీ వారు నిబ్బరంగా ఉంటున్నారు. దీంతో కాంగ్రెస్ హై కమాండ్ కూడా అయిదు రాష్ట్రాలలో విజయం ఖాయం అంటోంది. మొత్తానికి ఈసారి తెలంగాణా కాంగ్రెస్ పరం అనే అంటోంది ప్రస్తుత పరిస్థితి.




## రాములమ్మ వరుస ట్వీట్లతో క్లారిటీ ఇచ్చేశారు..!

హైదరాబాద్: బీజేపీకి రాములమ్మ గుడ్‌బై చెప్పబోతున్నట్లు తెలుస్తోంది. గత కొంత కాలంగా ఆమె కమలం పార్టీలో అసంతృప్తిగా ఉన్నారు. ఎప్పటి నుంచో ఆమె పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరిగింది. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి బీజేపీని వీడినప్పుడే విజయశాంతి కూడా పార్టీ మారతారని ప్రచారం జరిగింది. కానీ అలా జరగలేదు. ఈసారి మాత్రం పార్టీ మార్పు ఖాయమని వార్తలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఆమె వరుసగా పెడుతున్న ట్వీట్లే కారణంగా తెలుస్తోంది. గత కొంతకాలంగా పువ్వు పార్టీలో అసంతృప్తిగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కూడా లభించలేదు.. పైగా స్టార్ క్యాంపెయినర్ లిస్ట్‌లో కూడా చోటు దక్కలేదు. దీంతో రాములమ్మ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఓ వైపు ఉధృతంగా ప్రచారం జరుగుతున్నా ఎక్కడా పాల్గొనడం లేదు. దీంతో నేడో.. రేపో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు పొలిటికల్‌గా చర్చ నడుస్తోంది.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు.. మాదిగ విరోధులు




హైదరాబాద్: భారాస, కాంగ్రెస్ పార్టీలు.. మాదిగ విరోధులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యారు. "ఎంతో ప్రేమతో నన్ను ఈ సభకు ఆహ్వానించారు. మందకృష్ణ నా చిన్న తమ్ముడు. ఇంత ఆత్మీయత చూపించిన మాదిగ సమాజానికి ధన్యవాదాలు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోంది. సామాజిక న్యాయానికి మేం కట్టుబడి ఉన్నాం. స్వాతంత్ర్యం వచ్చాక అనేక ప్రభుత్వాలను చూశారు. ఆ ప్రభుత్వాలకు, మా ప్రభుత్వానికి తేడా గమనించాలి. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. అనేది మా విధానం. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ 30 ఏళుగా పోరాటం చేస్తున్నారు. మూడు దశాబ్దాల మాదిగల ఉద్యమానికి నా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నా. పేదరిక నిర్మూలనే మా ప్రథమ ప్రాధాన్యం. న్యాయం చేస్తామని అనేక పార్టీలు మిమ్మల్ని వాడుకున్నాయి. మీరంతా వన్ లైఫ్. వన్ మిషన్‌లా పోరాటం చేస్తున్నారు. మీ బాధలు పంచుకునేందుకే నేను ఇక్కడకు వచ్చా.


**భారాస ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తోంది..** తెలంగాణలో భారాస ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తోంది. దళిత నేతను సీఎం చేస్తామని భారాస నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్ సీఎం కుర్చీలో కూర్చున్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని మోసం చేశారు. ప్రస్తుతం తెలంగాణ సంకట స్థితిలో ఉంది. తెలంగాణ అస్థిత్వాన్ని భారాస కాపాడలేకపోయింది. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామన్నారు.. ఇవ్వలేదు. దళితబంధు అన్నారు.. ఇవ్వలేదు. దళిత బంధు పథకం వల్ల భారాస నేతలకే మేలు జరిగింది. దళితుల ఆశలపై నీళ్లు చల్లింది కేసీఆరే. తెలంగాణలో భారాస, కాంగ్రెస్ ఒకరికొకరు పోటీపడుతున్నట్టు నటిస్తున్నారు. ఆ రెండూ అవినీతి పార్టీలే. దిల్లీలోని ఆప్ ప్రభుత్వంతో కలిసి అవినీతి చేస్తున్నారు. అవకాశవాద రాజకీయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను ఎన్నికల్లో రెండు సార్లు ఓడించింది. కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ సెంట్రల్ హాలులో అంబేడ్కర్ చిత్రపటం కూడా పెట్టలేదు.

అంబేడ్కర్‌కు భారతరత్న కూడా ఇవ్వలేదు. మేం వచ్చాక అంబేడ్కర్ ఫొటో పెట్టాం.. భారతరత్న ఇచ్చాం. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేస్తుంటే కాంగ్రెస్ వ్యతిరేకించింది. గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత భాజపాదే. దళిత బిడ్డ రామ్‌నాథ్ కోవింద్‌ను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. దళిత వ్యక్తి రాష్ట్రపతి కావడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు" అని మోదీ విమర్శించారు.

**మా ఆకాంక్షలు నెరవేర్చేది భాజపానే: మందకృష్ణ మాదిగ –** దేశాన్ని కాపాడే విషయంలో, దేశాన్ని అభివృద్ధి చేసే విషయంలో ప్రధాని మోదీని మించిన నాయకుడు లేరని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మోదీ ఒక్కసారి మాట ఇస్తే కచ్చితంగా నిలబెట్టుకుంటారనే విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. మాదిగ ఉపకులాల సభకు విచ్చేసిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. మాదిగల సభకు మోదీ వస్తారని తాము ఊహించలేదన్నారు. "ఈ సమాజం పశువులకంటే హీనంగా మమ్మల్ని చూసింది. మాదిగలను ఇప్పుడిప్పుడే చైతన్య పరుస్తున్నాం. మాకు అండగా ఉండేందుకు వచ్చిన మోదీకి ధన్యవాదాలు. కాంగ్రెస్, భారాస.. కేవలం మాటలే చెబుతున్నాయి. మా ఆకాంక్షలు నెరవేర్చేది భాజపానే. బలహీనవర్గాలకు అండగా ఉండే పార్టీ భాజపానే. తెలంగాణకు బీసీని సీఎంగా చేస్తామని ప్రకటించింది ఒక్క భాజపా మాత్రమే. మోదీకి సామాజిక స్పృహ ఉంది కనుకే మా సభకు వచ్చారు. బలహీన వర్గాల కష్టాలు ప్రధానికి బాగా తెలుసు. దళిత, గిరిజన బిడ్డలను రాష్ట్రపతులను చేసిన ఘనత ప్రధాని మోదీదే" అని మందకృష్ణ వివరించారు. ప్రధాని మోదీ సభావేదికపైకి రాగానే మందకృష్ణ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. మందకృష్ణను భుజం తట్టి మోదీ ఓదార్చారు.

# తెలంగాణ కాంగ్రెస్ నాయకుల రిమోట్ కర్ణాటక కాంగ్రెస్ పెద్దలు చేతుల్లోనే

## కాంగ్రెస్ వస్తే మన కృష్ణ నీటి వాటా, ఐటీ కంపనీలు తెలంగాణకు రావడం కష్టం





### కాంగ్రెస్ ను నమ్మితే తిరిగి పదేండ్లు వేనెక్కే...

### బి ఆర్ ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే గిరిజన బంధు : మంత్రి హరీష్ రావు

మేడ్చల్ జిల్లా బ్యూరో ( గరుడ వార్త): తెలంగాణ కాంగ్రెస్ నాయకుల ఎన్నిక ప్రక్రియ నుండి మొదలు ప్రచారం వరకు మొత్తం కర్ణాటక నుండే జరుగుతోందని ఇది తెలంగాణ సమాజానికి ఎంతో చేటు కలిగించబోతుందని మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం శామీర్ పేట మండలం తుముకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ ఎన్ ఆర్ పుష్ప కన్వెన్షన్ హాల్లో రాష్ట్రస్థాయి గిరిజనుల లోకల్ బాడీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు తోపాటుగా మంత్రి సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ... 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే తప్పకుండా తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మారుస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వారి హామీలను తుంగలో తొక్కారని మంత్రి హరీష్ రావు అన్నారు. అయితే సీఎం కేసీఆర్ మాత్రం 2014లో తాను ఇచ్చిన వాగ్దానం అనుసారం ప్రతి లాంబాడ తండాలను పంచాయతీలు గా ఏర్పాటు చేశారని మంత్రి హరీష్ రావు అన్నారు. అంతే కాకుండా ప్రతి తాండకు నీటి ఎద్దడిని మిషన్ భగీరథ తో తీర్చారని అన్నారు. దాంతో పాటుగా ప్రతి తాండకు రవాణా వ్యవస్థ కల్పించడానికి 4000 కోట్ల రూపాయలను తెలంగాణ ప్రభుత్వం వెచ్చించిందని ఆయన గుర్తు చేశారు. బంజారాలకు బెత్తడు జాగలేని బంజారాహిల్స్ లో బంజారాలో కొరకు సుమారు ఒక ఎకరం స్థలం కేటాయించి భవనాలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్ దేనని మంత్రి హరీష్ రావు అన్నారు.

కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు నమ్మితే నష్టపోయేది తెలంగాణ రాష్ట్ర ప్రజలేనని మంత్రి హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ కి అభ్యర్థుల జాబితా కర్నాటక నుండే ఎన్నుకుంటున్నారని, ప్రచారంలో నాయకులు కర్ణాటక నుండి వస్తున్నారని, కాబట్టి రేపు తెలంగాణ రాష్ట్రాన్ని కూడా కాంగ్రెస్కు అధికారం కట్టబెడితే కర్ణాటక నుండే పరిపాలన జరుగుతుందని మంత్రి హరీష్ రావు అన్నారు. దానివల్ల ఎంతో ముఖ్యమైన మనకు రావాల్సిన కృష్ణా జలాలను మన వాటా మనకు రాకుండా కర్ణాటక రాష్ట్రం వాళ్ళు నీళ్లను మలుపుకునే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ పరిపాలనలో అత్యంత అభివృద్ధి చెందుతున్న ఐటిరంగం కూడా రేపు మళ్లీ తిరిగి బెంగళూరుకి వెళ్లే ప్రమాదం లేకపోలేదని హరీష్ రావు అనుమానం వ్యక్తం చేశారు. దాంతోపాటుగా తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే గిరిజన బందు పథకాన్ని తప్పకుండా ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... గిరిజనులకు అన్ని విధాలుగా నష్టం చేసిన కాంగ్రెస్ని నమ్మితే గిరిజనులకు తీరని నష్టం వాటిల్లోందని ఆమె హెచ్చరించారు. 11 సార్లు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎప్పుడు బంజారాలకు అవసరమైన సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టలేదని, కనీసం తండాలను గ్రామ పంచాయతీలు కూడా మార్చలేదని ఆమె ఎద్దేవా చేశారు. మాజీ ఎంపీ పేరు సీతారాం నాయక్ మాట్లాడుతూ... తాము తెలంగాణ రాష్ట్రంలో సుమారు పది శాతం మేర ఉన్నామని తాము రేపు రాబోయే ఎన్నికల ఫలితాల్లో తమ ఓట్లు కీలకమని అన్నారు. తమ బంజారాలపై ఆ వాక్కులు, చివాక్కులు పేలుతున్న కాంగ్రెస్ కు సరైన సమయంలో తగిన బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారామ్ నాయక్, ఎంపీ కవిత,జడ్పీ చైర్మేన్ బిందు,రాములు,శంకర్, సంజీవ్ నాయక్,వాల్యా నాయక్, రామ్ చందర్ నాయక్, సత్తన్న, లోఖిని, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బీజేపీనే చెత్త నెత్తినేసుకుంటోందా ?

కల్వకుంట్ల కవితను టార్గెట్ చేసుకుని కేంద్రమంత్రులు ఎందుకు మాట్లాడుతున్నారో అర్థంకావటం లేదు. తెలంగాణా ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారానికి వచ్చిన కేంద్రమంత్రులందరు కవిత తొందరలోనే అరెస్టవుతుందని పదేపదే చెబుతున్నారు. తప్పుచేసిన వాళ్ళని చట్టం ఎంతటివారైనా వదిలిపెట్టదని ధర్మపన్నాలు వినిపిస్తున్నారు. అసలు వీళ్ళని కవిత అంశాన్ని ప్రస్తావించమని ఎవరు చెబుతున్నారో అర్థంకావటం లేదు. తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పడిపోవడానికి కవిత అంశం కూడా ఒక కారణమన్న విషయం అర్థం కావటం లేదా అనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో సౌత్ గ్రూప్ తరపున కవితదే కీలక పాత్రని ఈడీ ఎప్పుడో తేల్చిచెప్పేసింది. స్కామ్ లో కవిత పాత్రగురించి ఈడీ కోర్టులో దాఖలుచేసిన చార్జిషీట్లలోను, రిమాండు రిపోర్టుల్లో కూడా చాలాసార్లే ప్రస్తావించింది. కేసులో ఇన్వాల్వ్ అయ్యారనే కారణంతో చాలామందిని అరెస్టు జైలుకు పంపించిన ఈడీ కవితను మాత్రం ఎందుకు అరెస్టుచేయలేదు ? అన్నది కీలకమైన ప్రశ్న. దీనికి జవాబుగా బీజేపీ-బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం జరగటమే అని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అండ్ కో పదేపదే ఆరోపిస్తున్నారు కాంగ్రెస్ ఆరోపణలను జనాలు కూడా నమ్మారు. లేకపోతే స్కామ్ లో సంబంధముందని ఇంతమందిని అరెస్టుచేసిన ఈడీ కీలక సూత్రదారైన కవితను మాత్రం ఎందుకు అరెస్టుచేయలేదన్న ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పలేకపోతున్నారు. అంతుకుముందు నరేంద్రమోడీని కేసీయార్ విపరీతంగా టార్గెట్ చేశారు. స్కామ్ లో కవితను ఈడీ విచారణ చేసిన దగ్గర నుండి మోడీ గురించి కేసీయార్ మాట్లాడటం మానేశారు. అసలు కేంద్రం గురించే కేసీయార్ మాట్లాడటంలేదు. ఇవన్నీ జనాలు గమనిస్తునే ఉన్నారు. దానికితోడు కాంగ్రెస్ ఆరోపణలతో బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని జనాలు నిర్ధారణకొచ్చేశారు. ఇదే సమయంలో బండి సంజయ్ ను అధ్యక్షుడిగా పార్టీ తీసేసింది. కర్నాటకలో కాంగ్రెస్ ఘనవిజయంతో తెలంగాణాలో ఊపు పెరిగింది. ఇదంతా తెలిసి కూడా కేంద్రమంత్రులు ఇంకా కవిత అరెస్టు ఖాయమని పదేపదే ఎందుకు చెబుతున్నారో అర్థంకావటంలేదు. కవిత అంశమే బీజేపీకి పెద్ద మైనస్ అని అర్థమైనపుడు ఇక దానిగురించి మాట్లాడకూడదు. అయినా పదేపదే మాట్లాడుతున్నారంటే చెత్త నెత్తినేసుకివటం తప్ప మరేమీకాదు.

# ఆక్రమణకు పన్నాగం.. తవ్వకాలు ఇష్టారాజ్యం!



సంగారెడ్డి: నీటి వనరులను పరిరక్షించాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు నిబంధనలను ఉల్లంఘిస్తూ చెరువులు కుంచించుకుపోయేలా పనులు చేస్తున్నారు. శిఖం, గరిష్ఠ నీటినిల్వ స్థాయి(ఎఫ్‌టీఎల్)తో పాటు బఫర్‌జోన్‌లోనూ ఎలాంటి నిర్మాణాలు చేపట్ట కూడదు. ప్రవాహానికి ఆటంకం కలిగేలా మట్టి పోయొద్దు. వీటన్నింటిని తుంగలో తొక్కుతూ కొందరు తమకు నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. సదాశివపేట మండలం ఎన్కెపల్లిలోని కొత్త చెరువే ఇందుకు నిదర్శనం.

నీరు చేరకుండా అడ్డుకట్ట రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారుల అనుమతి లేకుండా చెరువుల్లో ఎలాంటి పనులు చేయకూడదు. పట్టాభూములు ఉన్నా ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోయకూడదు. ఇక్కడ ఇవేవీ పాటించడం లేదు. కొత్తచెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా ఇదే విషయం బహిర్గతమైంది. వేసవిలోనూ చెరువులో నీళ్లు సమృద్ధిగానే ఉన్నాయి. చెరువులో నీళ్లున్న ప్రాంతం పక్కనే యంత్రాలతో లోతుగా కందకం తవ్వుతున్నారు. ఆ మట్టిని చుట్టూ కట్టలా పోస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అడిగేవారు ఎవరూ లేకపోవడంతో పట్టపగలే దర్జాగా చెరువు చుట్టూ ఇలాగే కట్ట నిర్మించడంలో కొందరు నిమగ్నమయ్యారు. ఈ కట్ట పోస్తున్న చోటు నుంచి వెనక్కి దాదాపు 500 మీటర్ల మేర చెరువులో నీళ్లుంటాయని అక్కడే ఉన్న కొందరు పశువుల కాపరులు వివరించారు.


మరోవైపు మట్టి నింపుతూ..

వర్షం కురిసినప్పుడు చెరువులోకి వరద చేరేలా ఉన్న కట్టు కాలువకు ఒకవైపు కందకం తవ్వి కట్ట పోస్తున్నారు. మరోవైపు ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీగా మట్టితో నింపుతున్నారు. ఏకకాలంలో ఈ రెండు పనులూ చకచకా చేసేస్తున్నారు. ఇది పూర్తయితే చెరువు పరిధి కుచించుకుపోతుంది. ఈ ప్రాంతం జాతీయ రహదారి 65కి పక్కనే ఉండటంతో ఇక్కడి భూములకు గిరాకీ బాగా ఉంది. దీనిని సొమ్ము చేసుకునే ప్రయత్నాలకు తెరలేపారు. కట్టుకాలువ వెడల్పును కొంత మేరకు తగ్గించేశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కనీసం చెరువు ఎంత విస్తీర్ణంలో ఉందనే ప్రాథమిక సమాచారం కూడా వారు సరిగా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

రెవెన్యూ, నీటి పారుదలశాఖల సమన్వయ లోపం

కొత్త చెరువు వద్ద నిబంధనల ఉల్లంఘన సాగుతున్న తీరు గురించి నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈ బాలగణేష్ దృష్టికి తీసుకెళ్లగా.. ఏఈతో పాటు స్థానిక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఇద్దరూ వెళ్లి పరిశీలించారన్నారు. ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోసినట్లు గుర్తించామన్నారు. దానిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏ మేరకు మట్టి నింపినట్లు గుర్తించారని ఏఈ మహేష్‌ను అడగ్గా... సరైన వివరాలు చెప్పలేకపోయారు. తాము సర్వే చేసిన తర్వాత పూర్తి నివేదిక ఇస్తామన్నారు. సదాశివపేట తహసీల్దారు మనోహర్ చక్రవర్తిని అడిగితే నీటిపారుదల శాఖ అధికారులదే బాధ్యతన్నారు. బుధవారం ఉదయం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కూడా వెళ్లారని నీటిపారుదల శాఖ అధికారి చెప్పారనడంతో ఆయన ఫోన్ నంబరు ఇచ్చారు. ఆర్ఐతో మాట్లాడాలని సూచించారు. చివరకు ఆర్ఐ గణేష్‌ను అడగ్గా... తాను కొత్త చెరువు వద్దకే వెళ్లలేదన్నారు. ఇదే విషయాన్ని ఏఈ మహేష్‌ను అడిగితే.. తానొక్కడినే వెళ్లి వచ్చానన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు సాగుతున్నాయన్నారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రెండు శాఖలకు, అధికారులకు మధ్య సమన్వయలోపానికి వారి మాటలే నిదర్శనం.

# దొంగ బిల్లులు.. లేని జబ్బులు





ఆసిఫాబాద్ : అత్యవసర అనారోగ్య సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న పేదలకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ముఖ్యమంత్రి సహాయక నిధి పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పూర్తిగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కొనసాగే ఈ పథకంలో జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గం పెద్దబూద గ్రామం కేంద్రంగా అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వ్యాధులు లేకుండా, శస్త్రచికిత్సలు ఏవీ చేయకుండానే సీఎంఆర్ఎఫ్ నిధులు కొందరు నేతలు ఒక్కటై పక్కదారి పట్టించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల పట్టణంలోని ఓ నేతకు సంబంధించిన ఆసుపత్రితోపాటు, మరో కార్పొరేట్ ఆసుపత్రి, కరీంనగర్ ఆసుపత్రి కేంద్రంగా ఈ దందా నడిచిందనే ప్రచారం సాగుతోంది. బెల్లంపల్లి మండలం పెద్దబూదలో మాజీ సర్పంచి ఈ తంతులో కీలకంగా వ్యవహరించి, రోగుల పేరుతో నకిలీ బిల్లులు సృష్టించి నగదు కాజేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఇటీవలే సీఎంఆర్ఎఫ్ నిధులు తీసుకున్న 23 మంది పేర్లు, ఎంతెంత బిల్లులు తీసుకున్నారో ఈ పోస్టుల్లో స్పష్టంగా ఉంది. రూ.18 వేల నుంచి రూ.87 వేల వరకు చెక్కులు తీసుకున్న వారి వివరాలు, ఒక్కొక్కరు రెండు, మూడు సార్లు బిల్లులు తీసుకున్నట్లుగా పేర్లు ఉన్నాయి. ఈ ఒక్క గ్రామంలోనే ఈ మేరకు అవినీతి ఉంటే జిల్లా వ్యాప్తంగా మరెంతో ఉంటుందనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ రూ.50-60 లక్షల నిధులు పక్కదారి పట్టించినట్లుగా తెలుస్తోంది.

30 చెక్‌ల నిలిపివేత..

దొంగ బిల్లులు పెట్టి సీఎంఆర్ఎఫ్ నిధులు కొల్లగొట్టిన ఉదంతాలు బయటకు రావడం, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో పెద్దబూద పరిసర గ్రామాలకు సంబంధించిన 30 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయకుండా నిలిపివేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈ పథకం అక్రమాలు గత నెల రోజుల నుంచి ఆ పార్టీ నేతల్లో అంతర్గతంగా తీవ్రమైన చర్చకు దారి తీసింది. వేమనపల్లికి చెందిన ఓ మండలస్థాయి నేత, బెల్లంపల్లి మాజీ ఎంపీపీలు ఈ వ్యవహారంలో చక్రం తిప్పారని, ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.

ఇష్టానుసారంగా సహాయం..

ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి రూ.లక్ష వరకు ఖర్చు అయితే 40 శాతం, రూ.లక్ష దాటితే 80 శాతం ఆర్థిక సహాయం ఈ పథకంలో అందజేస్తారు. జిల్లాలో మాత్రం ఇష్టానుసారంగా బిల్లులు పెట్టి పెద్ద మొత్తంలో ఈ పథకం నిధులు జేబులో వేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సమగ్ర విచారణ చేయాలనే డిమాండ్ ప్రజలనుంచి వినిపిస్తోంది.

క్యాసినో ముఠా..

బెల్లంపల్లి, వేమనపల్లికి చెందిన కొందరు నేతలను క్యాసినో ముఠాగా స్థానికంగా పిలుస్తారు. బెట్టింగులకు పాల్పడడం, వివిధ పథకాల్లో అక్రమాలకు తెరతీయడం, అందులో వాటాలకు డిమాండ్ చేయడం, మాట వినని వారికి బెదిరింపులకు గురిచేయడం వీరి పనులు. హైదరాబాద్‌లోని ఓ నేతకు సన్నిహిత వ్యక్తి ద్వారా సీఎంఆర్ఎఫ్ నిధులను ఈ ముఠా సభ్యులే నొక్కేసినట్లుగా స్థానికంగా అందరూ చర్చించుకుంటున్నారు. ఓ మాజీ సర్పంచి తన బంధువులు, భార్య పేరు మీద ఏకంగా 7 సార్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులు తీసుకోవడం ఈ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలకు పరాకాష్ఠగా నిలుస్తోంది. నకిలీ పత్రాలు ఇచ్చిన వారికి కొంత మేర నగదు ముట్టచెప్పి, మిగతాదంతా వీరు నొక్కేస్తున్నారని, 2018నుంచి ఇప్పటి వరకు ఈ పథకంలో లబ్ధిపొందిన వారి వివరాలను పరిశీలిస్తే అసలు దొంగలు బయటకు వస్తారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# బకాయిల భారం

నిర్మల్ : పిల్లల హాజరుశాతం పెంపునకు, పోషక విలువలు కలిగిన పోర్టిఫైడ్(బలవర్ధక) బియ్యం సరఫరా వంటి వాటిని నిర్వహిస్తూ సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. రోజుకో రకంగా కూరగాయలు, పప్పు, వారానికి మూడుసార్లు గుడ్డు అందజేస్తున్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. వారు శ్రద్ధగా వంట చేస్తూ విద్యార్థులకు అందజేస్తున్నారు. బడులకు వేసవి సెలవులు ఇచ్చినా ఇంతవరకు తమకు రావాల్సిన బిల్లులు అందక ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్ద మొత్తంలో.. ఉమ్మడి జిల్లాలోని 3,503 ప్రభుత్వ విద్యాలయాల్లో పథకాన్ని అమలు చేస్తున్నారు. సుమారు 5వేలకుపైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గౌరవ వేతనంగా రూ.వెయ్యి ఇచ్చేవారు. దాదాపు రెండు నెలల క్రితం దానిని రూ.3వేలుగా అందించేందుకు సర్కారు నిర్ణయం తీసుకున్నా.. బడ్జెట్ కేటాయింపు మాత్రం ఇప్పటి వరకు చేయలేదు. వంటకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో సదరు నిర్వాహకులు అప్పులు తీసుకొచ్చి వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భరించి మరీ వంట చేశారు. నాలుగు జిల్లాలకు చెంది సుమారు రూ. 7.74 కోట్లు రావాల్సి ఉన్నాయి. అప్పులు చేసి.. బకాయిలు పేరుకుపోవడంతో అప్పులు చేసిన సదరు కార్మికులు వాటిని తీర్చేదెలా అని ప్రశ్నిస్తున్నారు. ఒక పక్క బడుల బలోపేతం, మౌలిక వసతుల కల్పనకు మన ఊరు- మన బడి, మన బస్తీ- మన బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా.. వంట చేసిన బిల్లులు, ఇచ్చే గౌరవవేతనం మంజూరుకాక ఎదురు చూపులు చూసే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు వివరాలను ఆర్థిక శాఖకు పంపించినా ఇప్పటి వరకు వాటి జాడలేదు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకొని చెల్లింపులు చేసి ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు.

# అమ్మకానికి మాస్టర్ ప్లాన్ రహదారులు..!

మంచిర్యాల : మంచిర్యాలలో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం కలగానే మిగిలిపోయింది. గతంలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిపాదిత రహదారులను నిర్మించకపోవడంతో ఆయా కాలనీల ఇరుకు రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మాస్టర్‌ప్లాన్ రహదార్లను కొంతమంది అమ్మకానికి పెడుతున్నారు. నిర్మాణాలు చేపట్టకుంటే ఆ స్థలాల్లో పక్కా భవనాలు నిర్మించే ప్రమాదముంది. మంచిర్యాల పట్టణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయోజనం లేని పనులు చేస్తూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. దీర్ఘకాలిక సమస్యగా మారిన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ముందుగా 1977లో మాస్టర్ ప్లాన్ రహదారులకు ప్రతిపాదనలు చేశారు. 25 ఏళ్లకోసారి పునఃపరిశీలన చేయాల్సి ఉండగా.. ఇక్కడ ఆలస్యంగా 2013లో చేశారు. అప్పుడు కొంతమంది రాజకీయ నాయకుల పట్టా భూములు రహదారిలో పోవద్దనే ఉద్దేశంతో పరపతిని ఉపయోగించి తమకనుకూలంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారు. స్థానిక గోపాల్‌వాడ నుంచి ఆదర్శనగర్, వేములబస్తీ, తిలక్‌నగర్, సున్నంబట్టీవాడలోని లయన్స్ క్లబ్ భవనం వరకు నిర్మించే కొత్త, పాత మాస్టర్ ప్లాన్ల మధ్య చాలా వ్యత్యాసం వచ్చింది. ఒక్కోచోట ఒక మీటర్ నుంచి 30 మీటర్ల వరకు తేడా వచ్చింది. ఈ రెండు రహదారులకు ముందే సరిహద్దులు (ట్రెంచ్ కట్) ఏర్పాటు చేయకపోవడంతో ఆ ప్రతిపాదిత రహదారి స్థలాల్లో కొన్ని ఇప్పటికే చేతులు మారాయి. కొంతమంది స్థిరాస్థి వ్యాపారులు పాత మాస్టర్ ప్లాన్ చూపించి కొత్త మాస్టర్ ప్లాన్ ప్రతిపాదిత రహదారి స్థలాలు అమ్ముకున్నారు. మరికొందరు కొత్త మాస్టర్ ప్లాన్ చూపించి



పాత మాస్టర్ ప్లాన్ రహదారి స్థలాలు విక్రయించారు. అక్కడ ఎలాంటి భవన నిర్మాణాలు చేపట్టకముందే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రహదారులకు హద్దు కేటాయించి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. మంచిర్యాలలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి బైపాస్‌రోడ్డు వరకు 80 అడుగుల ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రహదారి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. బెల్లంపల్లి చౌరస్తా దగ్గర ఓ ప్రైవేట్ వ్యక్తికి చెందిన 1,815 గజాల స్థలానికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రూ.6.34 కోట్లు చెల్లించడానికి రంగం సిద్ధం చేశారు. అయితే అక్కడి భూమికి ఎక్కువ ధర చెల్లించడంపై ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో దానిని పెండింగ్‌లో పెట్టారు. మంచిర్యాలలోని సున్నంబట్టీవాడలో గల ప్రధాన రహదారి నుంచి లయన్స్ క్లబ్ భవనం వరకు రెండేళ్ల కిందట 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారిపై దాదాపు రూ.2 కోట్లతో బీటీ నిర్మించారు. ఆ లయన్స్ క్లబ్ భవనం తర్వాత ప్రైవేట్ వ్యక్తుల పట్టా భూములు ఉండటంతో రహదారి నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి తిలక్‌నగర్ వెళ్లే రహదారికి లింక్ లేకుండా పోయింది.

మంచిర్యాలలోని లక్ష్మీ సినిమా టాకీస్ చౌరస్తా నుంచి గోపాల్‌వాడ, హమాలివాడ మీదుగా 100 అడుగుల ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ఉంది. హైటెక్‌సిటీ కాలనీ పక్కన ఈ రహదారి స్థలం తమది అంటూ ఓ పరిశ్రమ యజమాన్యం కోర్టులో కేసు వేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి శ్రీరాంపూర్ వచ్చినప్పుడు అక్కడ రైల్వే పైవంతెన నిర్మాణం కోసం రూ.57 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత కోర్టు కేసుతో నిధులు మంజూరుకాలేదు. పనులు చేపట్టలేదు. తిలక్‌నగర్‌లో మాస్టర్ ప్లాన్ రహదారి మధ్యలో చాలా తేడా వచ్చింది. పాత మాస్టర్ ప్లాన్ రహదారి ఊరు మధ్యలో గల ఆటో స్టాండ్ నుంచి నిర్మించాల్సి ఉంది. కొత్తగా మార్చిన మాస్టర్ ప్లాన్ తిలక్‌నగర్ ఊరు బయట నుంచి వచ్చింది. అక్కడ రహదారి నిర్మాణంలో వచ్చిన తేడాతో ఎక్కడ రహదారి నిర్మిస్తారో ఎవరి భూములు పోతాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# ఎరువుల కొరత లేకుండా చర్యలు: కలెక్టర్

మెదక్ : వానాకాలంలో పంటల సాగుకు సరిపడా ఎరువులను ముందస్తుగానే ప్రణాళిక చేసుకొని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని పాలనాధికారి రాజర్షిషా ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన వ్యవసాయ, మార్క్‌ఫెడ్, సహకారశాఖల అధికారులతో సమీక్షించారు. వానాకాలంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ రసాయన ఎరువులు 96,340 టన్నులు అవసరమని, కొరత లేకుండా ఈనెల నుంచి సెప్టెంబరు వరకు నిర్దేశించుకున్న లక్ష్యానికి అదనంగా పది శాతం అదనంగా ఎరువులు సరఫరా చేసేందుకు సంస్థలు సిద్ధంగా ఉండాలన్నారు. పీవోఎస్ యంత్రం ద్వారా గరిష్ఠ అమ్మకం ధరలకు లోబడి విక్రయించాలని ఆదేశించారు. రైల్వేమార్గం ద్వారా మెదక్, తిమ్మాపూర్, గజ్వేల్, సనత్‌నగర్, కామారెడ్డి రాక్‌పాయింట్‌ల నుంచి ఎరువులను భద్రపర్చేందుకు గోదాంలను సిద్ధంగా ఉంచాలని,



రామాయంపేటలో వెయ్యి టన్నుల సామర్థ్యం గల గోదాంను సిద్ధం చేసుకోవాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు 40 శాతం, ప్రైవేట్ డీలర్లకు 20 శాతం, మిగిలినవి 37 ఆగ్రో రైతు సేవాకేంద్రాలకు సరఫరా చేయాలన్నారు.

వచ్చే నెల 11న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని పాలనాధికారి ఆదేశించారు. ఆయన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. సమావేశాల్లో అదనపు పాలనాధికారి రమేశ్, జిల్లా అధికారులు ఆశాకుమారి, కరుణ, క్రాంతి, రాధాకిషన్, రాజిరెడ్డి, ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్లు, ఏవో పాల్గొన్నారు.

# ఎన్నికల సందడి లేని గ్రామాలు

ధన్వాడ : నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ పరిసర గ్రామాల్లో శాసనసభ ఎన్నికల సందడి కనిపించడం లేదు. మిగతా గ్రామాల్లో ఈ గట్టు నుంచి ఆ గట్టుకు, ఆ గట్టు నుంచి ఈ గట్టుకు చేరికలు, ఇంటింటి ప్రచారాలు, ఆల్పాహారాల సందడి కొనసాగుతుండగా చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం గ్రామాలు మాత్రం ఎన్నికల వాతావరణానికి దూరంగా ఉన్నాయి. ఈ మూడు గ్రామాల జనాభా 14వేలుంగా, 4911 మంది ఓటర్లు ఉన్నారు. గత నెల 22న ఎక్లాస్‌పూర్ గేటు వద్ద కంపెనీ వ్యతిరేకులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణ, లాఠీఛార్జి కారణంగా గ్రామాల్లో నిశ్శబ్దం ఆవరించింది. ఘర్షణలో పోలీసులతో పాటు ఆందోళనకారులు గాయపడ్డారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. 183 మందిపై



పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురిని అరెస్టు చేశారు. ఎఫ్ఐఆర్‌లో 183 మంది, ఇంకా ఇతరులు అనే పదాన్ని చేర్చడంతో ఇప్పటికీ పోలీసులు కేసులు పెట్టేందుకు వెనుకాడటంలేదు. దీంతో ఆ గ్రామాల్లో యువకులు బయట ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. ఇదే అదనుగా లేనివారి పేర్లను చేర్చేందుకు పోలీసుశాఖపై ఒత్తిళ్లు రావడంతో కొందరు రహస్య ప్రదేశాలకు వెళ్లి యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకొని ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. ఈ గ్రామాలకు రాజకీయ నాయకులు ప్రచారానికి రావడం లేదు. ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తారన్న భయం అధికార పార్టీలోనూ, వ్యతిరేక ఉద్యమానికి మద్దతు తెలపలేనందున నిలదీస్తారన్న భయంతో ప్రతిపక్షాల నాయకులు రావడం లేదు. ఈ గ్రామాలపై పోలీసుల నిఘా ఉండటం కూడా ప్రశాంతతకు కారణంగా చెప్పుకోవచ్చు.

## ఊరూరా విద్యుత్ కాంతులు

నిర్మల్ : వ్యవసాయానికి పెట్టింది పేరైన నిర్మల్ ప్రాంతంలో ఉమ్మడి రాష్ట్రంలో బోర్లే జీవనాధారం. పక్కనే గోదావరి, స్వర్ణ, గడ్డెన్న–వాగులున్నా.. సాగునీరు అందని దుస్థితి. బీఆర్ఎస్ పాలనలో, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సారథ్యంలో నిర్మల్ ప్రగతి పథంలో పయనిస్తున్నది. సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతుండగా.. ఇప్పటికే మిషన్ కాకతీయ ఫలితాలు అందుతున్నాయి.
వ్యవసాయానికి పెట్టింది పేరైన నిర్మల్ ప్రాంతంలో ఉమ్మడి రాష్ట్రంలో బోర్లే జీవనాధారం. పక్కనే గోదావరి, స్వర్ణ, గడ్డెన్న–వాగులున్నా.. సాగునీరు అందని దుస్థితి. బీఆర్ఎస్ పాలనలో, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సారథ్యంలో నిర్మల్ ప్రగతి పథంలో పయనిస్తున్నది. సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతుండగా.. ఇప్పటికే మిషన్ కాకతీయ ఫలితాలు అందుతున్నాయి. కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణంతో కరెంటు కోతలకు చెక్ పడింది.
1952 సంవత్సరం నుంచి నిర్మల్ నియోజకవర్గ రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ప్రభుత్వం నూతన జిల్లాలు ఏర్పాటు చేయడంతో నిర్మల్ నియోజకవర్గం జిల్లా కేంద్రమయ్యింది. నర్సాపూర్(జి), నిర్మల్ అర్బన్, సోన్, కొత్త మండలాలు ఏర్పడ్డాయి. ఇటీవల పొన్కల్, బీరవెల్లిలను నూతన మండలాల జాబితాలో చేర్చారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావుపై బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిచారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరి రాష్ట్ర గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖల మంత్రిగా



బాధ్యతలు స్వీకరించారు. 2018లో బీఆర్ఎస్ నుంచి రెండో సారి విజయం సాధించారు. నిర్మల్ పట్టణం, నియోజకవర్గం, నిర్మల్ జిల్లాను అంచెలంచెలుగా అభివృద్ధి చేశారు. పట్టణంలో సభలు, సమావేశాల నిర్వహణ కోసం రెండు వేల మంది ప్రజలు కూర్చునేందుకు వీలుగా రూ.5 కోట్లతో బీఆర్ అంబేద్కర్ భవనాన్ని నిర్మించారు. రూ. కోటితో మత్స్య శాఖ భవనం, రూ.5 కోట్లతో ముస్లింలకు చించోలిలో ఈద్గా ప్రార్థన మందిరం, ఆర్అండ్‌బీ ద్వారా రూ. 194 కోట్లతో 313 కిలో మీటర్ల మేర రహదారులు, రూ.94 కోట్లతో 25 వంతెనలు నిర్మించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 13 పనులకు రూ.1,062.29 కోట్లు ఖర్చు చేశారు. సోన్ మండలంలోని బొప్పారంలో రూ.1,160 కోట్లతో 400 కేవీ సబ్‌స్టేషన్, రూ.1,182.15 కోట్లతో 16 సబ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ద్వారా రూ. 105 కోట్లతో 628 ఆలయాల అభివృద్ధి, రూ.17.65 కోట్లతో 4044 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. 73 మహిళా సంఘాలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏ ర్పాటు చేయించారు. రూ.10 కోట్లతో ఫుట్‌పాత్‌ల నిర్మా ణం, రూ. 46 లక్షలతో 150 అడుగుల జాతీయ జెండాను ఏర్పా టు చేశారు. రూ.5.18 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి పట్టణాన్ని వి ద్యుత్ వెలుగులతో నింపారు.
రూ.68.17 కోట్ల రైతుబంధు
2022–23 సంవత్సరానికి 60,809 మంది రైతులకు రూ.68.17 కోట్ల రైతుబంధు సాయం అందించారు. రూ. 300 కోట్లతో ఆయిల్ పామ్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.714 కోట్లతో ఏర్పాటు చేసిన లక్ష్మీనరసింహస్వామి ఎత్తిపోతలతో 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. రూ.396 కోట్లతో నిర్మల్ పట్టణ సమగ్రాభివృద్ధి పనులు, రూ.166 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం కొనసాగుతున్నది.

# ఎన్నికల వేళ.. సామాజిక మాధ్యమాల్లో గోల



కొల్లాపూర్ : ప్రస్తుత శాసనసభ ఎన్నికల ప్రచారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఊపందుకుంటోంది. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ త్వరలో ముగియనుండటంతో అభ్యర్థుల విజయం కోసం ఆయా పార్టీల కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మార్మోగిస్తున్నారు. అభ్యర్థులు సైతం ప్రచార సమయం సరిపోక సామాజిక మాధ్యమాలపై ఆధారపడుతున్నారు. ఇందుకు ప్రత్యేకంగా సాంకేతిక నిపుణులను నియమించుకున్నారు. ఆయా పార్టీల కార్యాలయాల్లో కూర్చొని కొత్త తరహా ప్రచారం చేస్తున్నారు. వెంట వెళ్తూ ఎప్పటికప్పుడు అభ్యర్థుల ప్రచారాన్ని కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఎప్పటి కప్పుడు చిత్రాలు, తాజా అంశాలను సామాజిక మాధ్యమాల్లో పొందుపరుస్తున్నారు. దీంతో నిత్యం చరవాణుల్లో అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంటోంది.
సోషల్‌మీడియా ప్రచారకర్తల నియామకం.. : ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ తమతమ ప్రచారాలను విస్తృతం చేసేందుకు సోషల్‌మీడియా ప్రచారకర్తలను నియమించుకున్నారు. వారికున్న సాంకేతికత ప్రతిభను బట్టి రూ.10 వేల నుంచి రూ.లక్ష దాకా చెల్లిస్తున్నారు. ఇక అభ్యర్థులు ప్రచారానికి వెళ్లినప్పుడు ఒకరిద్దరు సోషల్‌మీడియా బాధ్యులను కూడా వెంటబెట్టుకుని వెళ్తున్నారు. ఓపక్క అభ్యర్థి తమ ప్రచారంలో భాగంగా మాట్లాడుతుండగానే తక్షణమే ఆయా అంశాలను పొందుపర్చి అభ్యర్థుల చిత్రాలు, వీడియోలతో వివిధ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడ్తున్నారు. గతంలో ఓ సామాజిక మాధ్యమం గ్రూప్‌లో సభ్యుల పరిమితి కేవలం 250 మాత్రమే ఉండేది. ప్రస్తుతం 1200 సభ్యులను గ్రూప్‌లో చేర్చుకునే వెసులుబాటు ఉంది. ఒకేసారి 1200 మంది చూస్తారని ఆ సామాజిక మాధ్యమాన్ని విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. ఇక పార్టీ కార్యాలయాలలో ఏర్పాటుచేసుకున్న సాంకేతిక సహాయకులు ప్రత్యేకంగా పోన్లు చేసి మేనిఫెస్టోను వివరిస్తున్నారు. మీకేమైనా సమస్యలుంటే తెలపాలని ప్రచార కర్తలు కోరుతున్నారు. ప్రత్యేకంగా ఓటరు కార్డుకూడా వాట్సప్‌లో పంపిస్తామని చెబుతున్నారు. చేరికలు జరిగితే బిగ్ బ్రేకింగ్ న్యూస్ అంటూ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సొంతపార్టీల హామీలు, ప్రత్యర్థుల ఆరోపణలు తిప్పికొడుతూ, వందలాది పోస్టులు పెడుతున్నారు.
నెట్ డాటా, చార్జింగ్ ధమాల్.. : పొద్దున లేస్తే చరవాణి ఆన్‌చేస్తే చాలు సామాజిక మాధ్యమం గ్రూపుల్లో వందలాది పోస్టులు వస్తున్నాయి. ఓపక్క నెట్ డాటా ఖర్చవటం, మరోపక్క ఛార్జింగ్ దిగిపోతోందని సామాన్యులు పేర్కొంటున్నారు. గ్రూపుల్లో ఒకే అంశంపై 10 ఫొటోలు పెడుతుండటంతో విసుగు తెప్పిస్తోందని పేర్కొంటున్నారు. వీటిపై ఏదైనా వ్యాఖ్యలు చేసినా, ఎగ్జిట్ అయినా తమ పార్టీవారు కాదని భావిస్తారేమోనని గమ్మున ఉంటున్నామని పేర్కొంటున్నారు.

# అతివలకు అవకాశం తక్కువే!



కొత్తకోట : అతివల్ని ఆకాశంలో సగం అంటూ పొగడటమే తప్ప ప్రజా ప్రతినిధులుగా పోటీ చేసే అవకాశం కల్పించింది తక్కువే. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పురుషులతో సమానంగా ఓటు హక్కు ఉన్న మహిళలకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వస్తున్న అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. శాసనసభకు జరిగిన తొలి ఎన్నికల నాటి నుంచి నవంబరు 30న జరగనున్న ఎన్నికల వరకు పరిశీలిస్తే ఇదే కళ్లకు కడుతుంది. రాష్ట్రంలో 1952లో తొలిసారిగా ఎన్నికలు జరగ్గా అప్పటి పరిగి నియోజకవర్గం నుంచి షాజహాన్‌బేగం, మక్తల్ నుంచి శాంతాబాయి పోటీ చేసి గెలుపొంది మహిళా ప్రతినిధుల ఖాతా తెరిచారు. తర్వాత ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 13 మంది మహిళలు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయగా ఎనిమిది మంది శాసనసభలో అడుగు పెట్టారు. వీరిలో ఆరుగురు కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించగా ఇద్దరు తెదేపా నుంచి ప్రాతినిధ్యం వహించారు. 15 సార్లు సాధారణ ఎన్నికలు జరగ్గా వాటిలో 1972, 1978, 1994లో అసలు మహిళలకు పోటీ చేసే అవకాశమే దక్కలేదు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లోనూ అతివలు చాలా తక్కువ మందే బరిలో నిలిచారు.
తాజాగా..: తాజాగా(నవంబరు 30న) జరుగుతున్న ఎన్నికల్లో కూడా ప్రధాన రాజకీయ పార్టీలు మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యం అంతంతే. భారాస అన్ని సీట్లను పురుషులకే కేటాయించగా కాంగ్రెస్ ఇద్దరు మహిళలకు ఈసారి టికెట్లు కేటాయించింది. సరిత(గద్వాల), పర్నికరెడ్డి(నారాయణపేట) బరిలో నిలిచారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా బోయ స్వప్నకు పోటీ చేసే అవకాశం కల్పించారు. మక్తల్ నియోజకవర్గం బహుజన లెఫ్ట్ పార్టీ (నాగలిగుర్తు) నుంచి మంజుల నామినేషన్ దాఖలు చేశారు. కొల్లాపూర్ నుంచి ధర్మసమాజ్ పార్టీ నుంచి పాన్‌గల్ మాజీ ఎంపీపీ ఆది సంధ్యారాణి నామినేషన్ వేశారు. ఇక్కడి నుంచే మహిళా కాంగ్రెస్ బాధ్యురాలు కాటమోని తిరుపతమ్మ స్వతంత్ర, బర్రెలక్కగా యూట్యూబ్ ఛానల్ నిర్వహించే కర్నె శిరీష నిరుద్యోగుల తరపున స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలంపూర్ నుంచి ప్రేమలత నామినేషన్ దాఖలు చేశారు.జయలక్ష్మీదేవమ్మ: అలంపూర్ నియోజకవర్గం నుంచి 1957లో పోటీ చేసిన జయలక్ష్మీదేవమ్మ(కాం), తొలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిపై 78 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1962లో జరిగిన ఎన్నికల్లో అమరచింత నుంచి పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థిపై 7 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1967లో జరిగిన ఎన్నికల్లోనూ ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి మళ్లీ అదే అభ్యర్థి చేతిలో 2,465 ఓట్ల తేడాతో ఓటమి చెందారు.
రాణీ కుముదినీదేవి: సంస్థానాధీశులు పాలించిన వనపర్తిలో అప్పటికీ వారి అజమాయిషీ ఉండేది. సంస్థానానికి చెందిన రాణీ కుముదినీదేవి 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున నుంచి పోటీ చేసి 22 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందారు. 1967లో జరిగిన ఎన్నికల్లోనూ ఇదే నియోజకవర్గం నుంచి 14,420 ఓట్ల తేడాతో గెలుపొందారు. తర్వాత ఎన్నికలకు ఆమె దూరంగా ఉన్నారు.
ఇందిర: ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకురాలిగా ఉన్న ఇందిరను 1985లో తెదేపా తరపున షాద్‌నగర్ (ఎస్సీ రిజర్వు) నుంచి పోటీ చేయించారు. రాజకీయాలకే కొత్త అయిన ఆమె తెదేపా ప్రభంజనంలో 7,018 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో పోటీచేయగా 8,700 ఓట్ల తేడాతో ఓటమి పాలవ్వడంతో ఆ తర్వాత తెదేపాను వీడి మరో పార్టీలో చేరినా పోటీ చేసే అవకాశం దక్కలేదు.
షాజహాన్‌బేగం: ప్రజాస్వామ్య పద్ధతిలో తొలిసారిగా 1952లో ఎన్నికలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పరిగి ఒకటి. అక్కడి నుంచి షాజహాన్‌బేగం(కాంగ్రెస్) గెలుపొందారు. తర్వాత నియోజకవర్గాల పునర్విభజనలో పరిగి రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వెళ్లగా 1957లో జరిగిన ఎన్నికల్లో కొత్తగా ఏర్పడ్డ షాద్‌నగర్ నుంచి పోటీ చేసి ప్రాతినిధ్యం వహించారు.
డీకే అరుణ: గద్వాల నియోజకవర్గం నుంచి 1999లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున తొలిసారిగా పోటీ చేసిన డీకే అరుణ తెదేపా అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. 2004లో సమాజ్‌వాదీ పార్టీ తరపున పోటీచేసి విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుబంధ సభ్యురాలిగా ఉండి మంత్రి అయ్యారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు. 2014 ఎన్నికల్లోనూ విజయాన్ని దక్కించుకొన్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి తెరాస అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు.
స్వర్ణ సుధాకర్‌రెడ్డి: అమరచింత నియోజకవర్గం నుంచి 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన స్వర్ణ సుధాకర్‌రెడ్డి 13,783 ఓట్ల తేడాతో తెదేపా అభ్యర్థిపై గెలుపొందారు. 2009 ఎన్నికల్లో దేవరకద్ర నియోజక వర్గం నుంచి పోటీ చేసి ప్రత్యర్థి సీతాదయాకర్‌రెడ్డి(తెదేపా) చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత వైకాపాలో చేరారు. ఆ తర్వాత తెరాసలో చేరారు. 2014, 2018 ఎన్నికల్లో టికెట్ ఆశించినా నిరాశే మిగిలింది.కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి : దేవరకద్ర శాససభ స్థానం నుంచి 2009లో తెదేపా అభ్యర్థిగా కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డికి అవకాశం దక్కింది. అప్పటికే జడ్పీ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన ఆమె ఈ ఎన్నికల్లో 19,036 ఓట్ల మెజార్టీతో స్వర్ణసుధాకర్‌రెడ్డిపై విజయం సాధించారు.శాంతాబాయి: మక్తల్–ఆత్మకూర్ నియోజకవర్గం నుంచి 1952లో శాంతాబాయి (కాం) పోటీ చేసి గెలుపొందారు. 1957 ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి పోటీచేసి విజయం సాధించారు. 1962లో కల్వకుర్తి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1967లో ద్యాప గోపాల్‌రెడ్డి చేతిలో ఓటమిని చవిచూశారు. ఈ ఎన్నిక నిబంధలకు విరుద్ధంగా జరిగిందని కోర్టుకెళ్లి ఎన్నికను రద్దు చేయించారు.

## గుట్టుగా కట్టేస్తున్నారు!

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ పట్టణం క్రిస్టియన్‌పల్లి పరిధి సర్వే నంబరు 523లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు ఊపందుకున్నాయి. రాత్రికి రాత్రే పరదాలు, తడికలు కట్టేసి నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు ప్రహరీల ఎత్తుపెంచి ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఈ తతంగం నడిపిస్తున్నారు. ఇక్కడ కట్టడాలను రెవెన్యూ అధికారులు నిషేధించారు. ఎలాంటి అక్రమ కట్టడాలు చేపట్టేందుకు వీల్లేదు. కడితే కూల్చేందుకు రెవెన్యూ శాఖకు అధికారాలు ఉన్నాయి. అయినా ఇవేమీ పట్టించుకోకుండా కొందరు అక్రమార్కులు రాత్రికి రాత్రే అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పదుల సంఖ్యలో కొత్త నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికల విధుల్లో రెవెన్యూ అధికారులు తలమునకలుగా ఉండటంతో ఇటు వంక ఎవరూ రారు, పట్టించుకోరన్న ధీమాతో అక్రమార్కులు చకాచకా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. సర్వే నంబరు 523లోని ప్రభుత్వ భూమిలో 2004లో పేదలకు 65 గజాలు, కొందరికి 75 గజాల చొప్పున విడతల వారీగా మంజూరు చేసి పట్టాలు ఇచ్చారు. ఆ తర్వాత పట్టాలు తీసేసుకుని రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇచ్చారు. కొందరు పట్టాలు ఇవ్వకుండా అలాగే ఉంటున్నారు. గతంలో ఇచ్చిన 75 గజాల పట్టాల స్థలం ఇస్తే చాలా మంది 150 నుంచి 200 గజాల వరకు ఆక్రమించుకుని ప్రహరీలు నిర్మించి అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. ఈ విషయం గతంలో రెవెన్యూ అధికారుల దృష్టికి రావడంతో వారు హెచ్చరించారు. నివాసం ఉంటున్న ఇళ్లను వదిలి ఇతర గృహాలను కూల్చేశారు. తాజాగా శాసనసభ ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో రెవెన్యూ అధికారులంతా ఎన్నికల విధుల్లో తలమునకలయ్యారు. ఇదే అవకాశంగా అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయి. పదుల సంఖ్యలో ఇళ్లను నిర్మిస్తున్నారు. ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాలా మంది నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు రాక ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ మాత్రం దర్జాగా కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం విశేషం.

# 'బండ్ల'తో అభివృద్ధి బాట

గద్వాల : ఉమ్మడి రాష్ట్రంలో గద్వాల నియోజకవర్గానిది దయనీయ పరిస్థితి. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు అభివృద్ధి చెందారు కానీ గద్వాల మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఇక్కడి నుంచి గెలిచిన డీకే అరుణ మంత్రి పదవి చేపట్టారు కానీ నియోజకవర్గ ప్రగతిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. రెండు నదుల మధ్య ఉన్న ఈ నడిగడ్డ నేల మీద పంటలు ఎండిన దుస్థితికి కారణం గత పాలకులే.కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే గద్వాలకు మంచి రోజులు వచ్చాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధి వేగం పుంజుకున్నది. గద్వాల కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేసింది. రూ.581 కోట్లతో గట్టు ఎత్తిపోతలనుచేపట్టింది. సమృద్ధిగా సాగునీరు అందుతున్నది. అభివృద్ధిలో గద్వాల నెంబర్ వన్‌గా నిలుస్తున్నది.
గద్వాల ఫైల్స్
గద్వాల నియోజకవర్గం నుంచి డీకే అరుణ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పదేండ్ల పాటు ఉమ్మడి రాష్ట్రంలో ఆమె మంత్రిగా పనిచేశారు. ఆమె భర్త డీకే భరతసింహారెడ్డి సైతం గద్వాలకు ఒకసారి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇరవై ఏండ్ల పాటు ఏలిన డీకే దంపతులు నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యం. అక్కడక్కడ రోడ్లు, రెండు కళాశాలల ఏర్పాటు తప్ప చేసిందేమీలేదు. ఇదే సమయంలో గద్వాలకు సాగునీటిని అందించడంలో ఆమె విఫలమయ్యారనే విమర్శలూ ఉన్నాయి. పైగా కృష్ణానది నుంచి నీటిని అక్రమంగా ఆనాటి ఆంధ్రా ప్రాంతానికి తీసుకెళ్లడాన్ని ఆమె అడ్డుకోలేదనే అసంతృప్తి ఇక్కడి ప్రజల్లో బలంగా ఉన్నది.
రూపురేఖలు మార్చిన కేసీఆర్ సర్కార్
కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక గద్వాల అభివృద్ధిబాట పట్టింది.
గద్వాల కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేసింది.
దీంతో నియోజకవర్గ ప్రజలకు పాలన చేరువయ్యింది.
రూ.45 కోట్ల వ్యయంతో ప్రభుత్వం సమీకృత కలెక్టరేట్ భవనాన్ని, రూ.28 కోట్లతో జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని నిర్మించింది. ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించడంతో జిల్లా కేంద్రమైన గద్వాల పట్టణం వేగంగా విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్నది. ఇక్కడి ప్రజలు సుదీర్ఘకాలంగా కోరుతున్న మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతున్నది. 300 పడకల ప్రభుత్వ దవాఖాన వచ్చింది.
గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గెలిచిన తర్వాత గద్వాల రూపురేఖలే మారిపోయాయి. అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ప్రభుత్వ విద్య, వైద్యం మెరుగయ్యింది. రూ.581 కోట్లతో ప్రభుత్వం గట్టు ఎత్తిపోతలను చేపట్టింది. నెట్టెంపాడు ద్వారా సమృద్ధిగా సాగునీరు అందుతున్నది. ఇక్కడి రైతన్నలు రెండు పంటలు పండించుకుంటున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తాజాగా ఎన్నికల బరిలో నిలిచారు.

## బీఆర్ఎస్ పాలనలో మూడింతలు పెరిగిన ఐటీ ఎగుమతులు

గద్వాల : తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఐటీ ఎగుమతులు మూడు రెట్లు పెరిగాయి. దేశంలోనే ఐటీరంగం పెట్టుబడులకు తెలంగాణ కేంద్రంగా మారింది. జిల్లా కేంద్రాలు, ద్వితీయ శ్రేణి పట్టణాలకు కూడా సాఫ్ట్‌వేర్ కంపెనీలు వస్తున్నాయి. ఐటీరంగ ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఐదేండ్లకోసారి ఐటీ పాలసీలను రూపొందించి అమలు చేస్తున్నది.తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఐటీ ఎగుమతులు మూడు రెట్లు పెరిగాయి. దేశంలోనే ఐటీరంగం పెట్టుబడులకు తెలంగాణ కేంద్రంగా మారింది. జిల్లా కేంద్రాలు, ద్వితీయ శ్రేణి పట్టణాలకు కూడా సాఫ్ట్‌వేర్ కంపెనీలు వస్తున్నాయి. ఐటీరంగ ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఐదేండ్లకోసారి ఐటీ పాలసీలను రూపొందించి అమలు చేస్తున్నది. తెలంగాణ ఏర్పాటు సమయంలో 3 స్టార్టప్ ఇంక్యుబేటర్లు, 200 స్టార్టప్‌లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం 77 ఇంక్యుబేటర్లు, 7 వేలకు పైగా స్టార్టప్‌లు ఉన్నాయి. టీ హబ్, టీహబ్ 2.0, టీవర్క్స్, వీహబ్,



టీఎస్ఐసీ, రిచ్ వంటి ఇంక్యుబేటర్లను రాష్ట్రప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తున్నది.విశేషం: పారిశ్రామిక పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా నిలిచింది. తొమ్మిదిన్నరేండ్ల వ్యవధిలో రాష్ట్రానికి 23 వేలకు పైగా పరిశ్రమలు క్యూ కట్టాయి. అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్, ఫార్మా కంపెనీలు దేశంలో తమ శాఖలను ప్రారంభించేందుకు పరిశీలిస్తున్న తొలి మూడు ప్రాథమ్య రాష్ట్రాల్లో తెలంగాణ పేరు కచ్చితంగా ఉంటున్నది.
తొమ్మిదిన్నరేండ్లలో ఐటీ ఎగుమతుల్లో మార్పు ఇది
2014: రూ.66,276 కోట్లు
2023: రూ.2,41,275 కోట్లు
పెరుగుదల 264%

## జైలులో ఉన్నా ఓటేసే అవకాశం

మోత్కూరు: జైల్లో ఉన్న ఖైదీలు కూడా ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారత పౌరులందరికీ ఓటుహక్కు ఉంటుంది. తెలిసో తెలియకో చేసిన తప్పులకు జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఓటుహక్కును వినియోగించుకునే



అవకాశం కల్పించారు. ఈ విషయం తెలియక చాలామంది ఖైదీలు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు 'ప్రివెంట్యూడిటర్మినేషన్' పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ తాము ఓటర్లమని పోలింగ్‌బూత్, ఓటరు క్రమసంఖ్యతో దరఖాస్తు చేసుకుంటూ ఓటేసుకునే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌కు వినతి చేసుకోవాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్లను తెప్పించి జైలు నుంచే ఓటేసే అవకాశం ఖైదీలకు కల్పిస్తారు.

# ఉల్లంఘన షరామామూలే!

చేర్యాల: ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. నిబంధనల ప్రకారం ప్రచారం చేసుకోవాలని ఎన్నికల అధికారులు అభ్యర్థులకు అనుమతులు ఇస్తున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓట్లు అభ్యర్థిస్తూ ఊరూరా వీధుల్లో తిరుగుతున్నారు. డప్పు చప్పుళ్లు, మైకుల్లో పాటలు, ప్రసంగాల హోరు ఉంటోంది. ఈసారి ఎన్నికల్లో శబ్దాలు చేసే టపాసులు కాలుస్తున్నారు. పోటాపోటీగా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రార్థన మందిరాలు, విద్యాలయాలు ఉన్న ప్రాంతాల్లో నిబంధనలను పట్టించుకోకుండా ప్రచారం చేస్తున్నారు. పాఠశాలల ఎదుట వాహనాలను నిలిపి మోగిస్తున్నారు. తరగతులు నిర్వహించే సమయంలో బడి ఎదుట వాహనాలు నిలిపుతున్నారు. సినిమా పాటల



తీరులో ప్రచార గీతాలు ఉండటంతో విద్యార్థుల్లో తరగతి గదుల్లో ఏకాగ్రత పెట్టలేకపోతున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. శబ్ద తీవ్రత పెరిగినా కేసు నమోదు చేయాలి. విద్యాలయాలు, వైద్యశాలలు, న్యాయస్థానాలున్న ప్రాంతాల్లో శబ్ద తీవ్రత నియంత్రణలో ఉండాలి.

బడి పిల్లలతోనా?

జిల్లాలోని ఓ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరై ప్రచారంలో ఇటీవల పాల్గొన్నారు. పాటలకు నృత్యాలు చేస్తుంటే నాయకులు, గ్రామస్థులు చప్పట్లు కొడుతున్నారు. కుటుంబ సభ్యులు డబ్బుల కోసం ప్రోత్సహిస్తున్నారు.

# కొత్త కొత్తగా.. ఉన్నది

మామడ : సాధారణంగా ఉద్యోగులు విధులను తమ తమ శాఖల్లో చేస్తుంటారు. అప్పగించిన బాధ్యతలను కార్యాలయంలోనో, క్షేత్ర పరిధిలోనో నిర్వహిస్తుంటారు. అయితే ఉన్నట్టుండి రోజువారీకి భిన్నంగా.. ఇతర శాఖల అధికారులు చేపట్టే పనులు చేయాల్సి వస్తే.. కొత్తగా ఉంటుంది. కొంత వింతగానూ అనిపిస్తుంది. అదో రకమైన అనుభూతి కలుగుతుంది. ఇప్పుడు ఎన్నికల కాలం కదా.. ఇలాంటి 'కొత్తదనం' చాలా మందికి ఎదురవుతోంది.

ఈ బృందాల్లో ఎక్కువ మందికి..

ఎన్నికల నియమావళి అమలయ్యేందుకు పలు బృందాలను ఏర్పాటు చేశారు. డబ్బు, మద్యం రవాణాను నిరోధించేందుకు చెక్‌పోస్టులు



పెట్టారు. వాటి బాధ్యతలను ఎస్ఎస్‌టీ బృందాలకు అప్పగించారు. ఇతర ప్రాంతాల్లోనూ తిరుగుతూ వాటిపై నిఘా పెట్టేందుకు ఎఫ్ఎస్‌టీలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి కదలికను నమోదు చేసేందుకు వీఎస్‌టీ, వీవీటీ బృందాలు రేయింబవళ్లు తిరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 250 బృందాలు విధులు నిర్వహిస్తున్నాయి. వీటిలో పోలీసు అధికారులు మినహా మిగతా వారంతా 'నిఘా' విధులు నిర్వర్తించే వారు కాదు. వ్యవసాయ అధికారులు, అధ్యాపకులు, ఇతర శాఖల గజిటెడ్ అధికారులే ఉంటారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో కలిసి విధులు నిర్వర్తించడం, కొత్త వారితో పరిచయాలు, తనిఖీలు ఇవన్నీ తమకు నూతన అనుభూతిని కలిగిస్తున్నాయంటున్నారు దిలావర్పూర్ వ్యవసాయాధికారి స్రవంతి, మామడ ప్రభుత్వ మాధ్యమిక కళాశాల అధ్యాపకుడు పురుషోత్తం, నిర్మల్‌కు చెందిన వీడియోగ్రాఫర్ శ్రీనివాస్‌తోపాటు మరికొందరు.

అంతటా వీడియోగ్రాఫర్లు!

మామూలుగానైతే ఫొటో, వీడియోగ్రాఫర్లు ప్రైవేటు వ్యక్తులే. వారికి ప్రభుత్వపరంగా విధులు నిర్వర్తించే అవకాశం ఉండదు. కానీ ఎన్నికల నేపథ్యంలో.. అనేక వర్గాల వారు ఈ కార్యంలో పాలు పంచుకుంటారు. ఈ తరుణంలో ప్రతి అంశాన్ని నిఘా పెట్టి నిక్షిప్తం చేయాలంటే వీడియోలు, కెమెరాలు కీలకంగా మారాయి. ప్రతి చెక్‌పోస్టు వద్ద, తనిఖీ బృందంలో వీడియోగ్రాఫర్లు కనిపిస్తున్నారు. వారూ ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రతినిధులే.

# ముగ్గురిదీ ఒకే రెవెన్యూ గ్రామం

చౌటుప్పల్ : సంస్థాన్ నారాయణపురం న్యూస్‌టుడే: మునుగోడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే పదవికి పోటీ చేస్తున్న భారాస, భాజపా, సీపీఎం అభ్యర్థులు ముగ్గురిదీ సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేలు రెవెన్యూ గ్రామం కావడం విశేషం. భారాస అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిది లింగమోనిగూడెం. భాజపా అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డిది మల్లారెడ్డిగూడెం. సీపీఎం అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డిది నాగమోనిగూడెం. ఈ మూడు గ్రామాలూ సర్వేలు రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయి. ఈ నియోజకవర్గం నుంచి నామినేషన్లు దాఖలు చేసిన బీఎస్పీ, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థులది సైతం సంస్థాన్ నారాయణపురం మండలమే. బీఎస్పీ అభ్యర్థి అందోజు శంకరాచారి జనగాం గ్రామానికి చెందినవారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి ఏర్పుల గాలయ్యది పుట్టపాక గ్రామం.

# అనుక్షణం.. ప్రత్యక్ష వీక్షణం




పెద్దపల్లి : ఎన్నికలను సమర్థంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ఎన్నికల సరళిని నిరంతరం పర్యవేక్షించేందుకు పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

మారుమూల ప్రాంతాల్లో అంతర్జాల సిగ్నల్ సమస్యతో గత ఎన్నికల్లో పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఇప్పటివరకు వెబ్‌కాస్టింగ్ అనుకూలంగా లేని ప్రాంతాల్లో వీడియో సర్వైలెన్ చేశారు. ఈ ఎన్నికల్లో ప్రతి కేంద్రంలో పోలింగ్ తీరును పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని నిర్ణయించారు. గత ఎన్నికల్లో ఇంజినీరింగ్ విద్యార్థుల సేవలను వినియోగించగా ఈ సారి ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించనున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా సిగ్నల్ అందుబాటుపై ఆరా తీస్తున్నారు.

ఆన్‌లైన్‌లో పోలింగ్ ప్రక్రియ

ఎన్నికల్లో ప్రత్యర్థులపై ఆధిపత్యం కొనసాగించేందుకు కొందరు అభ్యర్థుల వర్గీయులు అల్లర్లు, ఘర్షణలకు పాల్పడుతున్నారు. డబ్బు, మద్యం, ఇతర కానుకలతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఒకరికి బదులు మరొకరు వేస్తుండటంతో దొంగ ఓట్లు నమోదవుతున్నాయి. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పద్ధతిని ప్రవేశపెట్టారు. పోలింగ్ ప్రక్రియ ముగిసేవరకు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నిక్షిప్తం కానుంది. ఎక్కడైనా ఘర్షణలు చోటుచేసుకుంటే స్థానిక పోలీసు సిబ్బందితో పాటు అదనపు బలగాలను పంపి అదుపులోకి తీసుకొస్తున్నారు.

గత ఎన్నికల్లో ఇలా..

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించారు. అక్కడి నుంచి జిల్లాకేంద్రంలోని మానిటరింగ్ విభాగానికి అనుసంధానించారు.

వెబ్‌కాస్టింగ్ కోసం ఇంజినీరింగ్ విద్యార్థులను నియమించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి భృతి చెల్లించారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ల్యాప్‌టాప్‌లో పోలింగ్ దృశ్యాలను నిక్షిప్తం చేశారు.

జిల్లా స్థాయిలో అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పర్యవేక్షిస్తున్నారు.

ఏదైనా ఘటనలు జరిగితే వీడియో చిత్రాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు.

సిగ్నల్ లేకపోవడమే పెద్ద సమస్య

ఉమ్మడి జిల్లాలో 3,662 పోలింగ్ కేంద్రాలున్నాయి. పల్లెల్లో 3జీ, 4జీ సేవలు అందుబాటులో లేకపోవడంతో వెబ్‌కాస్టింగ్‌లో అంతరాయం జరిగింది. సిగ్నల్ సక్రమంగా లేకపోవడంతో ఆశించిన స్థాయిలో ప్రయోజనం లేదు. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్ర స్థాయిలో ఒకే ఏజెన్సీకి బాధ్యతలు అప్పగిస్తున్నారు. టెలికాం సేవలు అందుబాటులో లేని చోట్ల ప్రత్యామ్నాయంగా ఏదైనా ఒక నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్‌కాస్టింగ్ లేదా, వీడియో సర్వై లైన్ ఏర్పాటు చేశారు. గత సమస్యలను గుర్తించిన ఎన్నికల సంఘం అన్ని చోట్లా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తోంది.

# తెల్లారక ముందే.. మాధ్యమం కూస్తోంది



కోదాడ : ఒకప్పుడు కోడి కూతతో నిద్ర లేచేవారు. సెల్ ఫోన్‌లు వచ్చాక వాటి అలారం అలవాటుగా మారింది. ప్రస్తుతం ఎన్నికల పుణ్యమా అని అలారంతో అవసరం కూడా లేకుండా తెల్లవారు జామున 3 గంటల నుంచే వాట్సప్ గ్రూపుల సందేశాల శబ్దాలు మేల్కొల్పుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఊరూరా ప్రచార రథాలతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రచార గడువు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ పార్టీ.. ఆ పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీలు వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. దీంతోపాటు జిల్లా, నియోజకవర్గం, మండలంతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఎక్కడ ఏ పార్టీ నాయకుడు మాటలో తూలినా గ్రూపుల్లో తెగ వైరల్ చేస్తున్నారు.

చూడలేక, చదవలేక ఓటర్ల తిప్పలు..

ఇదంతా బాగానే ఉన్నా.. ఎన్నికల వేళ సాంకేతిక పరి(అ)జ్ఞానం మితిమీరిపోతోంది. ముఖ్యంగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి చేస్తున్న ప్రచారం సగటు ఓటర్లను ఇబ్బంది పెడుతోంది. ఫొటోలు, వీడియోలు, సమావేశాల సమాచారాన్ని పదుల సంఖ్యలో ఒకేసారి గ్రూపులో పోస్టు చేస్తుండటం సగటు మనిషికి విసుగు తెప్పిస్తోంది. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో ప్రధాన పార్టీల నాయకులు వారికి తెలిసిన నంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేశారు. తమ గ్రూపులో ఎక్కువ మంది ఉన్నారని చెప్పుకోవడానికి తమ వద్ద ఉన్న నంబర్లన్నీ కలుపుతున్నారు. దీంతో అవసరం ఉన్నా.. లేకపోయినా సదరు గ్రూపుల్లో వచ్చే ఎన్నికల సందేశాల గోల ప్రతి రోజు అర్ధ రాత్రి వరకు భరించడం చరవాణిదారుల వంతైంది.

గ్రూప్‌లో ఉండలేక.. మొహమాటానికి వెళ్లలేక..

ఏదైనా పార్టీకి చెందిన వాట్సప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే ఇష్టమున్నా లేకున్నా మొహమాటంతో పోస్టులను చూడలేక, చదవలేక సతమతమవుతున్నారు. చేసేది లేక పొరపాటున ఎగ్జిట్ అయితే పార్టీ మనిషి కాదనే అవకాశం ఉంటుందని గమ్మున ఉంటున్నారు. ఒకే గ్రూపులోనే పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా పోస్టులు పెడుతుండటంతో సామాన్య ఓటరు అయోమయానికి గురవుతున్నాడు. పార్టీల ప్రచార చిత్రాలు, వీడియోలతో సెల్ ఫోన్లో నెట్ డాటా తొందరగా అయిపోతోందని, మళ్లీ డాటా రీఛార్జికి డబ్బులు ఖర్చవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనా ఈ ఎన్నికల స్మీజన్‌లో చెవిలో జోరీగలా వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ప్రచార లొల్లితో తిప్పలు తప్పేలా లేవని సామాన్య ఓటరు సతమతమవుతున్నాడు.

# ప్రజాక్షేత్రంలో.. ప్రచార అస్త్రం

నల్గొండ : నామినేషన్ల క్రతువు తుది దశకు చేరుకోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు పూర్తి స్థాయి ప్రచారంపై దృష్టి సారించారు. ఇంటింటి ప్రచారంతో పాటూ ప్రధాన నాయకుల రోడ్‌షోలు, బహిరంగసభలతో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే భారాస, భాజపా పూర్తి స్థాయిలో అభ్యర్థులను ప్రకటించగా..కాంగ్రెస్ తుంగతుర్తి, మిర్యాలగూడ, సూర్యాపేట మినహాయించి మిగిలిన తొమ్మిది నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ప్రస్తుతం అధికార పార్టీకి అన్ని నియోజకవర్గాల్లోనూ తమ పార్టీ ఎమ్మెల్యేలే ఉండగా.. వాటిని కాపాడుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. ఎలాగైనా ఈ దఫా ఉమ్మడి జిల్లాను క్లీన్‌స్వీప్ చేసేలా కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తుండగా.. ఈ దఫా బోణి కొట్టాలని భాజపా అభ్యర్థులు ఉత్సాహంగా ప్రజల్లోకి వెళుతున్నారు. బీఎస్పీ, ఫార్వర్డ్‌బ్లాక్ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు.

ఆరు గ్యారంటీలతో..హస్తం రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఈ రెండు రోజుల్లో కొంత మంది నామినేషన్ వేయనుండగా..నామినేషన్ అనంతరం పూర్తి స్థాయిలో కార్యక్షేత్రంలోకి దిగాలని కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నారు. ఇప్పటికే నల్గొండలో ఎంపీ కోమటిరెడ్డి నామినేషన్ వేశారు. ఈ నెల 10న మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి వేయనున్నారు. హుజూర్‌నగర్‌లో నేడు ఉత్తమ్ నామినేషన్ వేయనుండగా..రేపు (శుక్రవారం) కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇక్కడ రోడ్‌షోలో పాల్గొననున్నారు. ప్రచారం చివరి దశలో పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకల్లో ఒకరు నల్గొండలో జరగనున్న రోడ్‌షోలో పాల్గొంటారని ఎంపీ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున సర్పంచిలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. దీనిని సానుకూలంగా మలుచుకుంటూ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో ప్రజల వద్దకు వెళుతున్నారు. పార్టీకి ఇప్పటికే సంస్థాగతంగా బలంగా ఉన్న ఓటుబ్యాంకును కాపాడుకొని వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో విజయం సాధించేలా ముఖ్య నేతలు ప్రచార వ్యూహాల్ని రచిస్తున్నారు.

అధినేతే సారథిగా..కారు

ఇప్పటికే ఒక దఫా ప్రచారాన్ని పూర్తి చేసిన అధికార భారాస అభ్యర్థులు నామినేషన్ల అనంతరం రెండో దశ ప్రచారాన్ని ఉద్ధృతం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. రోడ్‌షోలు, సీఎం కేసీఆర్ బహిరంగ సభలతో ప్రచారాన్ని మరింత వేడెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 14న హాలియా, 20, 21వ తేదీల్లో సాగర్, నకిరేకల్, నల్గొండ, సూర్యాపేట నియోజకవర్గాల్లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. ఎన్నికల చివరి దశలో హుజూర్‌నగర్, కోదాడ, దేవరకొండ, నల్గొండ, మునుగోడుల్లో రోడ్‌షోలకు మంత్రి కేటీఆర్ హాజరవుతారు. మంత్రి హరీశ్‌రావు సైతం నకిరేకల్‌లో రోడ్‌షోలో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల వారీగా నియమించిన సమన్వయకర్తలు ప్రచార వ్యూహాలను పర్యవేక్షిస్తూనే ఇతర పార్టీల్లోని అసమ్మతి నేతలను పార్టీలో చేర్చుకునే విధంగా మంతనాలు చేస్తున్నారు. అభ్యర్థి కుటుంబ సభ్యులతో పాటూ పార్టీ కార్యకర్తలంతా ఒకటికి రెండుసార్లు ఇంటింటికీ తిరిగేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

బీసీ నినాదంతో.. కమలం

గతేడాది మునుగోడు ఉప ఎన్నికతో దేశం దృష్టిని ఆకర్షించిన భాజపా ఈ దఫా ఎలాగైనా ఉమ్మడి జిల్లాలో గెలిచి బోణి కొట్టాలనుకుంటోంది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు కసరత్తు చేస్తున్నారు. పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్న సూర్యాపేట, మునుగోడు, నల్గొండ, భువనగిరితో పాటూ మిగిలిన నియోజకవర్గాల్లోనూ గణనీయ సంఖ్యలో ఓట్లు సాధించేందుకు అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. 11 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించగా..పొత్తుల్లో భాగంగా కోదాడను జనసేనకు కేటాయించారు. పార్టీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారనే నినాదం నేపథ్యంలో గణనీయ సంఖ్యలో ఓట్లు వస్తాయని అభ్యర్థులు భావిస్తున్నారు.

# పంట పండలేదు.. పాడి నిల్వలేదు

ఆసిఫాబాద్ : గిరిజన రైతులను ఉద్యాన పంటల పరంగా ప్రోత్సహించి ఉపాధి కల్పించే ఉద్దేశంతో నాబార్డు అందించిన సాయం.. జిల్లాలో ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదు. సిబ్బంది పర్యవేక్షణ లేక ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడుతున్నాయి. బావులు అసంపూర్తిగా మిగలడం.., ఇచ్చిన ఆవులు మృత్యువాత పడ్డా.. బీమా డబ్బులు రాకపోవడం, వచ్చిన వాటిని రైతులకు ఇవ్వకుండా సిబ్బందే తీసుకోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. నీటివసతి లేక మామిడి పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాబార్డు అందించే ఆర్థిక సాయంతో సీపీఎఫ్(సెంట్రల్ పీపుల్ ఫారెస్టీ) ఎన్‌జీవో సంస్థ గిరిజన రైతులను ఉద్యాన పంటల పరంగా ప్రోత్సహించడం, స్వయం ఉపాధి కల్పనకు ముందుకొచ్చింది. తిర్యాణి మండలం పంగిడిమాదర, గిన్నెధరి, గుడిపేట గ్రామాల్లోని 450 గిరిజన కుటుంబాలను గుర్తించి 500 ఎకరాల్లో మామిడి, జామ తోటల పెంపకం కోసం అవసరమైన మొక్కలు అందించారు. వీటికి నీటి వసతి కోసం బావులు తవ్వించారు. ఆయిల్ ఇంజిన్లు, పైపులను అందించారు. 35 కుటుంబాలకు పాడి పరంగా ప్రోత్సహించే లక్ష్యంతో ఆవులను కొనుగోలు చేసి ఇచ్చారు. ఒక్కో ఆవుకు రూ.40 వేల చొప్పున వెచ్చించారు. వీటికి బీమా సైతం చేయించారు. 2019లో ఈ పథకం మంజూరు కాగా 2020, 2021లలో వాటిని అందించారు. ఇందుకు నాబార్డు రూ.2.43 కోట్లు మంజూరు చేసింది. నలుగురైదుగురు రైతులకు కలిపి ఒక బావిని తవ్వించారు. అలా పది బావులు నిర్మించారు. ఒక్కో రైతుకు 10 చొప్పున పైపులు అందించారు. కానీ వీటికి సంబంధించిన పరికరాలు ఇవ్వకపోవడంతో కొన్ని వృథాగా మారాయి. రాతి నేలలు కావడంతో బావులు ఎక్కువ లోతు తవ్వలేక



పోయారు. వర్షాధారంగానే నీరు లభించే పరిస్థితి నెలకొంది.

అందని బీమా..

పాడిపరంగా ప్రోత్సహించేందుకు 35 మంది రైతులకు ఆవులను అందించారు. వీటికి మేత సరిగా లేకపోవడం, వాతావరణ పరిస్థితులు తట్టుకోలేక సుమారు 15 వరకు జీవాలు మృతిచెందాయి. ఇప్పటి వరకు వాటిలో ఇద్దరికి మాత్రమే బీమా డబ్బులు మంజూరయ్యాయి. ఆ డబ్బులను సైతం రైతులకు ఇవ్వకుండా వారే తీసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. వాటిలో రెండు మూడు జీవాలు మినహా.. మిగతావి ఇంత వరకు కనీసం ఒక్క ఈత కూడా ఈనలేదని చెబుతున్నారు.

ఇక్కడా ఇదే పరిస్థితి..

సిర్పూర్(యు) మండలంలో 16 గ్రామాల్లో 130 మంది గిరిజనులకు మేకలు, కోళ్లు పంపిణీ చేసినట్లు, 120 కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించామని పేర్కొన్నారు. ఇందుకు నాబార్డు రూ.2.87 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కానీ వీటిపై పర్యవేక్షణ కొరవడి ఆశించిన ఫలితం రాలేదు.

తవ్విన బావిని చూపుతున్న రైతు మడావి లచ్చు. ఏడాది క్రితం జేసీబీ సాయంతో బావి తవ్వించారు. కొంత లోతుకు వెళ్లగానే రాయి వచ్చింది. దీంతో ముందుకు వెళ్లే పరిస్థితి లేక అర్ధాంతరంగా వదిలేశారు. భారీ వర్షాలు కురిస్తే.. అందులో కొంత వరకు నీరు చేరుతోంది. ఏజెన్సీలో అన్ని బావుల పరిస్థితి ఇలాగే ఉంది. ప్రస్తుతం పంట రక్షణ కోసం రెండు కి.మీ. దూరం నుంచి పైపుల ద్వారా తడులు అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

బీమా డబ్బులు వారే తీసుకున్నారు

గతంలో సంస్థ వారు ఒక జెర్సీ ఆవు ఇచ్చారు. అది ఒక ఈత ఈని మృతి చెందింది. ఇందుకు రూ.28 వేల బీమా డబ్బులు వచ్చాయి. బ్యాంకుకు తీసుకెళ్లి డ్రా చేయించి వారే తీసుకున్నారు. అవసరం అయితే మేకలు కొనిస్తామని చెప్పి వెళ్లారు. కానీ ఇప్పటి వరకు జాడలేరు. మా గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు ఆవు మృతి చెందడంతో ఆయనకు మంజూరైన రూ.25 వేల బీమా డబ్బులను సైతం వారే తీసుకున్నారు.

మర్సుకోల లచ్చు, భీంజిగూడ

త్వరలో మేకలు కొనిస్తాం

బీమా డబ్బులు వారిచేతికిస్తే ఖర్చు చేస్తారని మా వద్దే భద్రపరిచాం. త్వరలో మేకలు కొనిస్తాం. రాయి రావడంతో కొన్నిచోట్ల బావులు పూర్తి స్థాయిలో తవ్వలేదు. ప్రత్యామ్నాయం ద్వారా సదరు రైతులు నీటి వసతి కల్పించేలా చూస్తాం. చంద్రకాంత్, ఎన్‌జీవో సంస్థ ప్రతినిధి

# ఇటు కల్యాణం.. అటు కలవరం

తాంసి : నవంబరులో వివాహ ముహూర్తాలు ఎక్కువగానే ఉన్నాయి. శ్రావణమాసంలో ముహూర్తాలు తక్కువగా ఉండటంతో పెళ్లిళ్లు అంతగా జరగలేదు. కొందరు శ్రావణ మాసం కంటే ముందు సంబంధాలు మాట్లాడుకున్న వారు సమయం ఎక్కువగా ఉండాలని నవంబరులో పెళ్లి పెట్టుకోవడంతో పెళ్లి సందడి ఎక్కువగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సైతం నవంబరులో జరుగుతుండటంతో అటు పెళ్లిళ్లు.. ఇటు ఎన్నికల హడావుడి ఎక్కువగా ఉంది. ప్రచారంతోపాటు ఓటింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండటంతో అభ్యర్థులు కలవరానికి గురవుతున్నారు. ఈ నెల 16 నుంచి 18, 24, 28, 29 ఆ తర్వాత డిసెంబరు నెల ముగింపు వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఎన్నికలు జరిగే రోజు ముందు 29న పెళ్లి ఉంటే మరుసటి రోజు ఓటింగ్ ఉంది. వివాహానికి బంధువులు, మిత్రులు వస్తుండటంతో ఓటింగ్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. దీంతో అభ్యర్థుల్లో గుబులు పట్టుకుంది. ఉమ్మడి జిల్లాల్లో సుమారు 500లకుపైగా పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. అభ్యర్థుల ప్రచారం, వివాహాలు ఒకేసారి జరగనుండటంతో మండపాల్లో అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందడి చేయనున్నారు. దీంతో పెళ్లి తరఫు వారికి విందు ఖర్చు పెరిగే అవకాశాలు లేకపోలేదు. ఇంతకు ముందు పెళ్లి పత్రికలు ఇచ్చి ప్రజాప్రతినిధులను ఆహ్వానించినా వచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికికైనా సమయం కేటాయించాల్సిందే.

## వేట సమయంపై అవగాహన లేకే చేపలు మృత్యువాత..!

అశ్వాపురం : చేపలను పట్టే సమయంపై అవగాహన లేక తుమ్మలచెరువులోని అనేక క్వింటాళ్ల చేపలు నిత్యం చనిపోతున్నాయి. తెల్లవారుజామున 4గంటలకు చెరువులో వల వేస్తున్నారు. ఆ వలను ఒడ్డుకు లాగేందుకు దాదాపుగా 12గంటల సమయం పడుతోంది. సాయంత్రం 5 గంటలకు చేపలు అందుతున్నాయి. అప్పటికే సమయం మించడంతో కొన్నిటిని అమ్మి మరుసటి రోజు కోసం వలను చేపలతో సహా అలాగే చిక్కం కట్టి నీటిలో ఉంచుతున్నారు. తెల్లవారేసరికి నీటి వేడికి వలలో ఉన్న చేపలు చనిపోతున్నాయి. దీంతో వాటిని వృథాగా ఒడ్డున పారవేస్తున్నారు. ఒక్కరోజే దాదాపు 4 క్వింటాళ్ల చేపలు అలా చనిపోయి రూ.50 వేల నష్టం వాటిల్లింది. దీనిపై పరిసర గ్రామాల ప్రజలు



తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు చేపలు పడితే అందరూ ఎగబడుతున్నారని, వారు రాత్రి పూట చేపలు పడుతున్నారని ఆరోపించారు. దాంతో కొనేవారు రాక చేపలు చనిపోతున్నాయని పేర్కొన్నారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కురం నరసింహారావు మాట్లాడుతూ.. చేపలు పట్టేవారి లోపం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోం దన్నారు. రాత్రి పది, పదకొండు గంటల ప్రాంతంలో వల వేస్తే, మరుసటి రోజు ఉదయం పది గంటలకు చేపలు చేతికి అందుతాయ న్నారు. అప్పుడు కొనేవారికి, అమ్మేవారికి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందని, అలా చేపలను పట్టించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

## ఇళ్లపై హైటెన్షన్ కరెంటు తీగలు

భువనగిరి : భువనగిరి పట్టణంలోని పలు ప్రధాన ఆవాస ప్రాంతాల మీదుగా వెళ్తున్న హెచ్‌టీ విద్యుత్తు లైన్‌ను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. రెండు దశాబ్దాలుగా రెండు విద్యుత్తు లైన్లు విద్యానగర్, బంజారాహిల్స్, ప్రగతి నగర్, తాతానగర్ మీదుగా ఉన్నాయి. తీగలు ఇళ్లపై నుంచి వెళ్తుండటంతో ఇప్పటికే విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. 33 కేవీ హైటెన్షన్ విద్యుత్తు లైన్ ఒకటి హన్మాపురం సబ్‌స్టేషన్ నుంచి భువనగిరి సబ్‌స్టేషన్ వరకు ఉంది. మరొకటి భువనగిరి నుంచి బీబీనగర్ వైపు వెళ్తుంది. వందలాది ఇళ్ల మీదుగా విద్యుత్తు లైన్లు కొనసాగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆవాస ప్రాంత వాసి మహ్మద్ లయీఖ్ అహ్మద్ అన్నారు. డాబాలపైకి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి లైన్లను మార్చాలని డిమాండ్ చేశారు ఈ విషయమై డిస్కం పట్టణ ఏఈ హరినాథ్‌ను వివరణ కోరగా ఆవాస ప్రాంతాల మీదుగా సుమారు 4 కిమీల పొడవు విద్యుత్తు లైను ఉందని, వీటిని తొలిగించేందుకు రూ.4.5 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి లైన్లు తొలగిస్తామని వివరణ ఇచ్చారు.

## తొలగింపులే.. చేర్పుల్లేవ్!

గద్వాల :ధరూరు మండలానికి చెందిన కృష్ణవేణి వివాహం కావడంతో అత్తారింటికి వెళ్లారు. స్వగ్రామంలోని రేషన్ కార్డులో పేరు తొలగించి అత్తారింటి కుటుంబసభ్యుల కార్డులో చేర్చాలని దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ అధికారులు విచారణ చేసి తొలగించారు. అత్తారింటి కార్డులో పేరు నమోదు చేయలేదు. ఫలితంగా రేషన్ కోటా కోల్పోవాల్సి వస్తోంది. కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం ఎటూ తేల్చకపోవటంతో పుట్టింటి నుంచి మెట్టింటికి వెళ్లిన కొత్తకోడళ్లకు శాపంగా మారింది. ఇంటి పేరు మారినా రేషన్ కార్డులో మాత్రం పేరు నమోదు కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో వేల మంది కొత్త కోడళ్లు పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నా అధికారులు సమాధానం ఇవ్వలేని పరిస్థితి. మూడేళ్లుగా అర్జీలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయాయి. పేర్ల తొలగింపు ప్రక్రియ మాత్రం నిరంతరంగా కొనసాగుతోంది. పేరు నమోదుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్‌ను ప్రభుత్వం లాక్ చేయడంతో సమస్య ఏర్పడుతోంది.

వేలల్లో దరఖాస్తులు : పెళ్లి కాగానే కార్డుల నుంచి పేర్లు తొలగించాలని కొందరు యువతులు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. వారి పేరుతో మీద ఉన్న యూనిట్‌ను అధికారులు తొలగిస్తున్నారు. అత్తారింటి కార్డులో పేరు చేర్చే ఆప్షన్ లేకపోవటంతో కొందరు తొలగింపునకు ఒప్పుకోవటం లేదు. సదరు కార్డులు అలాగే కొనసాగుతుండగా పలు గ్రామాల్లో పేర్లు తొలగించాలని తహసీల్దార్లకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ మేరకు విచారణ చేసి తొలగిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలో ఒక్క పేరు కూడా చేర్చలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 9.35 లక్షల వరకు కార్డుదారులున్నారు. మూడేళ్లలో పేరు నమోదుకు నిరీక్షిస్తున్న వారి సంఖ్య 18,300 వరకు ఉన్నారు. కొత్తగా పెళ్లై.. వేరుకాపురం ఉంటున్న వారు కొత్తకార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల సంఖ్య వేలల్లో ఉంది.

ప్రత్యేక కార్యక్రమం పేరుతో తొలగింపు : ఐదేళ్లలో మరణించిన వారి పేర్లు ఇంకా కొనసాగుతుండటంతో యూనిట్ల సంఖ్య అలాగే ఉండటం వల్ల రేషన్ పక్కదారి పడుతోందని గ్రహించిన ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. కొత్తగా పెళ్లయిన వారు, మృతి చెందిన వారి వివరాలు పరిశీలించి తొలగిస్తున్నారు. అత్తారింటికి కార్డులో పేరు చేర్చుకునే అవకాశం ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. పెళ్లయిన వెంటనే పేరు తొలగింపునకు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత గిర్దావర్ విచారణ చేసి తహసీల్దార్ లాగిన్‌కు పంపిస్తారు. పేరు తొలగించినట్లు తహసీల్దార్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం తీసుకొని డీఎస్వో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. విచారణ చేసి పేరు చేరుస్తారు. దీనికి కమిషనరేట్ నుంచి ప్రత్యేక అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కూడా అత్తారింటికి ఉన్న కార్డులో మాత్రమే పేరు చేరుతుంది. కొత్తగా పెళ్లయిన జంటకు మాత్రం కార్డు జారీ అయ్యే అవకాశం లేదు. ప్రభుత్వం ఆప్షన్ ఇస్తే పరిశీలించి నమోదు చేస్తామని గద్వాల జిల్లా ఆర్డీవో రాములు చెపుతున్నారు.

# మహిళలకు రుణాలు.. ఉపాధి వెలుగులు



భూపాలపల్లి : మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.. గ్రామ మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తోంది.. వ్యాపార రంగంలో ఎదగడానికి ప్రోత్సహిస్తోంది. అతివలు కూడా రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో చెల్లించడంతో ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతోంది.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయ సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2034.31 కోట్లను రుణాలుగా అందించేందుకు ప్రణాళిక సిద్ధమైంది.. బ్యాంకు లింకేజీ ద్వారా అందించే ఆర్థిక సహాయంతో మహిళలు ఆర్థికంగా ఎదిగి బలోపేతం అయ్యేందుకు ఎంతగానో ఉపయోపడుతున్నాయి. కిరాణం, టైలరింగ్, దుస్తుల విక్రయ కేంద్రం, వ్యవసాయం, పాడి పశువుల పెంపకం తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లు నెలకొల్పేందుకు మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. సంబంధిత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రోత్సహించడంతో పాటు తీసుకున్న రుణాలను ఏవిధంగా పెట్టుబడికి వినియోగించుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. స్వయం ఉపాధి రుణాలు పొందడంతో పాటు రుణాలు సకాలంలో తిరిగి చెల్లించేలా ఏపీఎం, సీసీ స్థాయి అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

గత ఏడాది ఇలా..ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి 51,985 స్వయం సహాయక సంఘాలకు రూ.2419.38 కోట్ల రుణాలను అందించాలని లక్ష్యం నిర్దేశించుకొని వంద శాతం రుణాల పంపిణీ చేపట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 45,105 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2034.31 కోట్ల రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు నిర్దేశించిన లక్ష్యం మేరకు అందిస్తున్నా మరోవైపు స్త్రీ నిధి ద్వారా అనుకున్న లక్ష్యం నెరవేరడంలో వెనుకబడుతోంది. స్త్రీనిధి లక్ష్యం వంద శాతం నెరవేరడానికి అధికారులు చర్యలు తీసుకుంటే.. మహిళా సంఘాలకు మరింత ఆర్థిక తోడ్పాటు అందించినట్లు అవుతుందని, ఆ దిశగా అధికారులు ప్రయత్నం చేయాలని పలువురు మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వందశాతం రుణాలు అందిస్తాం- పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిజిల్లా వ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఏటా లక్ష్యం మేరకు రుణాలు అందిస్తున్నాం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ రుణాలు వంద శాతం అందిస్తాం. ఇప్పటి నుంచే రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తక్కువ వడ్డీకి రుణాలు పొందిన మహిళలు వాటిని వృథా చేయకుండా ఆర్థికంగా ఎదగడానికి వినియోగించుకోవాలి.

# రెండు అడుగులు వెనక్కి..!

భూపాలపల్లి : పదో తరగతి ఫలితాలు జిల్లాకు నిరాశను మిగిల్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం కంటే ఈసారి ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని భావిస్తే.. మరింత తగ్గాయి. గత సంవత్సరం జిల్లా ఉత్తీర్ణత రాష్ట్రంలో 20 స్థానంలో ఉండగా ఈసారి 22వ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం ఉత్తీర్ణత 91.49 శాతం ఉండగా ఈసారి 85.54 వచ్చింది. జిల్లాలో బాల బాలికలు మొత్తం 8,449 మంది పరీక్షలు మంది రాయగా వారిలో 7,227 మంది ఉత్తీర్ణులు కాగా బాలికలదే పైచేయిగా నిలిచింది. జిల్లాలోని 13 పాఠశాలలు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. గత సంవత్సరం వీటి సంఖ్య 21 ఉండగా ఈసారి తగ్గాయి. 13 పాఠశాలల్లో జడ్పీ ఉన్నత పాఠశాలలు 10, కేజీబీవీలు 02, మహాత్మ జ్యోతిబాపులే గురుకుల పాఠశాల ఒకటి ఉంది. గత ఏడాది ఒక ఆదర్శ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత రాగా ఈసారి ఒక్కటి కూడా రాలేదు.

ఆరు పాఠశాలల్లో రెండోసారి..!

ఈసారి పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించిన 13 పాఠశాలల్లో ఆరు పాఠశాలలు రెండోసారి కూడా ఈ ఘనతను నిలబెట్టుకున్నాయి. గంగారం, పెద్దవంగర కేజీబీవీలు, బత్తులపల్లి, ఓటాయి వీఎస్ లక్ష్మిపురం, రామాస్ ఉర్దూ మాధ్యమ పాఠశాలలు గత సంవత్సరంలో కూడా వంద శాతం ఉత్తీర్ణతను సాధించాయి. రెండు కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్య 50లోపు ఉంది. రామాస్ పాఠశాలలో కేవలం ఒకరు, లక్ష్మిపురం పాఠశాలలో 20లోపు మిగతా మూడు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పదిలోపే ఉంది. జిల్లాలో వివిధ యాజమాన్యాల 209 ఉన్నత పాఠశాలలకు చెందిన 7,227 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 85.54గా నమోదైంది. ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే మినీ గురుకులాల్లో ఎక్కువగా ఉంది. జిల్లాలో ఈ పాఠశాలలు మూడు ఉండగా ఉత్తీర్ణత శాతం 97.38 నమోదైంది.

కరోనా కాలంలోనే వంద శాతం!

గత విద్యాసంవత్సరాల్లో జిల్లాలో పదో తరగతి ఫలితాలను పరిశీలిస్తే ఒకసారి ఉత్తీర్ణత శాతం పెరుగుతూ మరోసారి తగ్గుతూ వస్తోంది. 2019-20, 2020-21 విద్యాసంవత్సరాల్లో కరోనా నేపథ్యంలో పరీక్షలు నిర్వహించకుండా అందరినీ ఉత్తీర్ణులు చేయడం వల్ల వంద శాతం ఉత్తీర్ణత నమోదయింది.

పెద్దకిష్టాపురంలో సున్నా ఫలితాలు!

గార్ల, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఉన్న 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 232 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా వీరిలో 157 మంది ఉత్తీర్ణులయ్యారు. జడ్పీఎస్ఎస్ మద్దివంచలో నలుగురు పరీక్షలు రాయగా నలుగురు ఉత్తీర్ణులయ్యారు. పెద్దకిష్టాపురం ఉన్నత పాఠశాలలో మొత్తం పది మంది పరీక్షలు రాయగా సున్నా ఫలితాలు వచ్చాయి.

ఉత్తీర్ణులైన విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు

జిల్లాలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కలెక్టర్ కె.శశాంక ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విజయానికి నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

పకడ్బందీ ప్రణాళికతో సాగుతాం- డీఈఓ రామారావు

పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు 2022-23 విద్యా సంవత్సరంలో విశేష కృషి చేశాం. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడంలో అన్ని విధాల సహాయ, సహకారాలను అందజేశాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశాం. వచ్చే విద్యా సంవత్సరంలో సమష్టి కృషి, పకడ్బందీ ప్రణాళికతో సాగుతాం. జిల్లాను ఫలితాల్లో రాష్ట్రంలో ఉన్నత స్థానంలో నిలబెడుతాం.

'పది'లో బాలికలదే హవా

పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. వరంగల్ జిల్లా రాష్ట్రంలో పదహారో స్థానంలో నిలిచింది. మొత్తం 9,710 మంది విద్యార్థులు హాజరవగా,.8,701 మంది (89.61 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అమ్మాయిలు సత్తా చాటారు. బాలురు 5,003 మందికి 4,447 మంది (88.89 శాతం), బాలికలు 4,707 మందికి 4,254 మంది (90.38 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 61 మంది విద్యార్థులు పది జీపీఏ సాధించారు. జిల్లాలో మొత్తం 69 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా అందులో 26 ప్రభుత్వ, 43 ప్రైవేటువి ఉన్నాయి.

# దండిగా అనుమతి లేని వ్యాపారం



సూర్యాపేట : జిల్లాలోని పురపాలికల్లో ఆశించిన స్థాయిలో ట్రేడ్ లైసెన్సులను వ్యాపారులు తీసుకోవడం లేదు. దీంతో ఆదాయానికి ఏటా లక్షల్లో గండిపడుతోంది. ఏ దుకాణం నడపాలన్నా పురపాలికల నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలి. కానీ, జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు అనుకున్న లక్ష్యానికి ఇంకా దూరంగానే ఉన్నాయి. జిల్లాలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి వరకు మొత్తం 5,340 దుకాణాలకు 3,086 ట్రేడ్ లైసెన్సులు పొందారు. ఎక్కువగా 2500 సూర్యాపేటలో, అతి తక్కువగా హుజూర్‌నగర్‌లో పది మంది మాత్రమే వ్యాపార అనుమతిని తీసుకున్నారు. వాస్తవానికి పట్టణంలో గత రెండేళ్లతో పోలిస్తే విపరీతంగా దుకాణాలు పెరిగిపోయాయి. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య, సంస్థలు పెరిగిపోతున్నా నిర్వాహకులు ట్రేడ్ లైసెన్సులు పొందటం లేదు.

విలీన గ్రామాల్లో అంతంతే..!జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల పురపాలికల్లో చుట్టుపక్కల గ్రామాలు విలీనమయ్యాయి. పట్టణానికి దగ్గరగా ఉండటంతో గతంలో ఉన్న వాటికి రెట్టింపు సంఖ్యలో కొత్త దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు వెలిశాయి. ఇందులో చాలా వాటికి ట్రేడ్ లైసెన్సు పొందకుండానే దుకాణాలు కొనసాగుతున్నాయి.

రుసుం లెక్కలిలా..

మున్సిపాలిటీలకు ఆదాయం పెంచేలా ప్రభుత్వం ట్రేడ్ లైసెన్సులో మార్పులు చేసింది. జీవో నెంబరు 147 జారీచేసింది. దీని ప్రకారం 20 అడుగుల లోపు రోడ్డును సింగిల్ లైన్‌గా, 30 అడుగుల లోపు ఉంటే డబుల్ లైన్, 30 అడుగుల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న రోడ్డును మల్టిపుల్ లైన్‌గా విభజించారు. ఆయా రహదారులకు ఇరువైపులా గల దుకాణాల విస్తీర్ణాన్ని బట్టి చదరపు అడుగుకు కనిష్ఠంగా రూ.3, గరిష్ఠంగా రూ.ఏడు చెల్లించి లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, చాలామంది దుకాణాల నిర్వాహకులు లైసెన్సులు తీసుకొనేందుకు ముందుకు రావడం లేదు. ఏదేని బ్యాంకులకు, ఇతరత్రా అవసరాలకు తప్పనిసరి పరిస్థితుల్లో ట్రేడ్ లైసెన్సును తీసుకుంటున్నారు.

ప్రతి దుకాణదారుడు అనుమతి తీసుకోవాలి-రామాంజులరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

పురపాలికల్లోని ప్రతి దుకాణదారుడు ట్రేడ్‌లైసెన్సు విధిగా తీసుకోవాలి. లేకుంటే తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు ముందుకొచ్చి అనుమతి పొంది పురపాలిక అభివృద్ధికి సహకరించాలి.

## మక్కల ధర పతనం

సూర్యాపేట : మొక్కజొన్న ధర రోజురోజుకూ పతనమవుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు 75 బస్తాల మక్కలు వచ్చాయి. గరిష్ఠంగా రూ.1325, కనిష్ఠ ధర రూ.1203 పలికింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు కంటే క్వింటాకు రూ.637 నుంచి రూ.759 వరకు తగ్గింది. వారం రోజుల నుంచి క్రమంగా వెల పడిపోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో 517 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవల ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాకు రూ.1962ను మద్దతు ధరగా నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు



చేయాలని ఆదేశించింది. కానీ, అధికారులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.సాకు చూపుతూ..రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన మక్కలు నాసిరకంగా ఉన్నాయని, తేమ ఉందంటూ వ్యాపారులు సాకు చూపుతున్నారు. మండుటెండలో కష్టపడి పండించిన పంటకు వ్యాపారులు కొర్రీలు పెడుతూ నష్టపరుస్తున్నారని రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆదేశించినా వ్యాపారులు, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. రవాణా ఖర్చులు రూ.2 వేల నుంచి రూ.3వేలు భరిస్తూ నష్టపోతున్నామని, మద్దతు ధరకు కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అకాల వర్షాలకు తడవడమే కారణం

ఫసియొద్దీన్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

అకాల వర్షాలకు మొక్కజొన్న తడిసింది. అందుకే వ్యాపారులు మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పై మార్కెట్‌లో ధర పతనం కావడంతో స్థానికంగా తగ్గుతోంది.

## సంచులు కదలట్లే..

కామారెడ్డి : "కడుపు నింపే అన్నదాత కష్టాల కడలి ఈదుతున్నాడు. ఆరుగాలం చమటోడ్చినా ఫలితం లేకుండా పోతోంది. ఆరంభంలో నకిలీ విత్తనాలు, ఎరువులతో నష్టపోయి పెట్టుబడి భారం మోశాడు. ఆ తర్వాత తెగుళ్లు సగం దిగుబడిని దెబ్బతీశాయి. చివరి వరకు కాపాడుకున్న పంటను ఇటీవల అకాల వర్షాలు, వడగళ్లు నిండా ముంచాయి. ఇప్పుడు వాతావరణం కాస్త కుదుటపడి కాంటా వేసినా.. ధాన్యం దించుకోవడంలో మిల్లర్లు కొర్రీలు పెడుతుండటంతో దిక్కుతోచక అల్లాడుతున్నాడు. ఆకాశంలో మేఘాలు దోబూచులాడుతుండటంతో మిగిలిన కాస్త దిగుబడులను ఎలా కాపాడుకోవాలోనని ఆందోళన చెందుతున్నాడు."

యాసంగి ధాన్యం సేకరణకు జిల్లాలో 344 కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించారు. ఇప్పటికే 330 కి పైన ప్రారంభించినా కేవలం 286 చోట్లనే కాంటాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాటి వరకు 1.16 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. మరో మూడున్నర లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉంది.

అన్‌లోడింగ్‌తోనే సమస్య

సేకరించిన ధాన్యం నాణ్యంగా లేదనే సాకుతో మిల్లర్లు అన్‌లోడింగ్‌కు ససేమిరా అంటున్నారు. ఫలితంగా మిల్లుల ఎదుట లారీలు బారులు తీరుతున్నాయి. ప్రభుత్వం తడిసిన ధాన్యం తీసుకోవాలని నిర్దేశించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో కేంద్రాల్లో కాంటాలు మందకొడిగా సాగుతున్నాయి. సంచులు తరలించేందుకు లారీలు రాకపోవడంతో అన్నదాతలు నాలుగు రోజులుగా నిల్వల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

వివరాలు మెట్రిక్ టన్నుల్లో

కేంద్రాల్లో కాంటా వేసింది : 1,16,032

మిల్లుల్లో అన్‌లోడ్ చేసుకున్నది : 89,470



ఇంకా చేయాల్సింది : 26,562

ఇబ్బందులు లేకుండా చర్యలుఅన్నదాతలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ధాన్యం నాణ్యంగా లేదనే ఉద్దేశంతో మిల్లర్లు అన్‌లోడ్ చేసుకోవడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో అదనపు పాలనాధికారి మిల్లర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. కాంటా వేసిన సంచులను తరలించేందుకు ప్రత్యేకంగా లారీలు పంపించాలని ట్రాన్స్‌పోర్టర్లను ఆదేశించారు. ధాన్యం సేకరణలో వేగం పెరిగింది. రోజువారీగా మిల్లులకు పది వేల మెట్రిక్ టన్నులు తరలిస్తున్నాం.

అభిషేక్, డీఎం, పౌరసరఫరాల శాఖ

పట్టించుకోవడం లేదు- శ్రీనివాస్, వాజిద్‌నగర్, బిచ్కుంద

కాంటా వేయడానికి పదిహేను రోజులు పట్టింది. ఇప్పుడేమో సంచులు తరలించేందుకు లారీలు రావడం లేదు. వాజిద్‌నగర్‌లో నాలుగు రోజులుగా లారీలు రాక కాంటాలు నిలిచిపోయాయి. వర్షానికి సంచులు తడిసిపోయేలా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకోవడం లేదు.

నెలరోజులకు తూకం- గంగారాం, వాజిద్‌నగర్, బిచ్కుంద

కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన నెలరోజుల తర్వాత కాంటా వేశారు. ప్రస్తుతం లారీలు రావడం లేదు. రోడ్డెక్కి ఆందోళన చేసినా అధికారులు స్పందించడం లేదు. అన్నదాతలకు అండగా నిలిచేవారే కరవయ్యారు.

# చంద్రమోహన్ మృతి పట్ల సీఎం జగన్ దిగ్భ్రాంతి





అమరావతి: సినీ నటుడు చంద్రమోహన్ మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. "ప్రముఖ నటుడు చంద్రమోహన్ గారు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూయడం బాధాకరం. తొలి సినిమాకే నంది అవార్డును గెలుచుకున్న ఆయన తెలుగు, తమిళ భాషల్లో వందలాది సినిమాల్లో నటించి తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. చంద్రమోహన్ గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ సీఎం జగన్ ట్వీట్ చేశారు. ప్రముఖ నటుడు చంద్రమోహన్ (78) కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. తరచూ డయాలసిస్ చేయించుకుంటున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం (నవంబర్ 11న) తుది శ్వాస విడిచారు. హైదరాబాద్‌లో సోమవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

చంద్రశేఖర్ అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖరరావు. కృష్ణాజిల్లా పమిడిముక్కలలో 1945 మే 23న జన్మించారు. మేడూరు, బాపట్లలో చదువుకున్నారు. ఈయన దివంగత దర్శకుడు కె.విశ్వనాథ్‌కి దగ్గరి బంధువు. చంద్ర మోహన్ భార్య పేరు జలంధర్. ఈమె రచయిత్రి. వీరికి మధుర మీనాక్షి, మాధవి అని ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మధుర మీనాక్షి సైకాలజిస్ట్‌గా అమెరికాలో స్థిరడ్డారు. రెండో కుమార్తె మాధవి చెన్నైలో వైద్యవృత్తిలో సేవలందిస్తున్నారు.

# ఇంకెంతమంది బలికావాలి జగన్?!




అమరావతి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్ అసమర్థపాలనకు ఇంకెంతమంది బలికావాలన్నారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రికి వేలకోట్ల ఆర్టీసీ ఆస్తులపై ఉన్న శ్రద్ధ కొత్త బస్సుల కొనుగోలు, నిర్వహణపై లేదని ఎద్దేవా చేశారు. విజయవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సు ప్లాట్ ఫాంపైకి దూసుకెళ్లి ముగ్గురు అమాయకులు బలైన దుర్ఘటన మరువక ముందే.. తాజాగా భీమవరం సమీపంలోని వీరవాసరంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కాజా శ్రీనివాసరావు (52) అనే ధాన్యం వ్యాపారిని ఢీ కొనడంతో మృతి చెందాడన్నారు. ప్రమాదానికి గురైన బస్సు బ్రేకుల్లో సమస్య ఉన్నట్లు డ్రైవర్లు ముందుగా చెప్పినా... స్పేర్ పార్టులకు డబ్బుల్లేవని మరమ్మతులతో సరిపెట్టిన దివాలాకోరు ప్రభుత్వమని దుయ్యబట్టారు. మెయింటినెన్స్ లోపం కారణంగా ప్రమాదం సంభవించినట్లు స్పష్టమవుతున్నందున ఇది ఖచ్చితంగా సర్కారీ హత్యేనన్నారు. మృతుడి కుటుంబానికి సరైన పరిహారం అందజేసి, ఇకనైనా దున్నపోతు ప్రభుత్వం కళ్లుతెరచి ఆర్టీసీ గ్యారేజిల్లో మెయింటినెన్స్‌కు నిధులు విడుదల చేయాల్సిందిగా కోరుతున్నానని నారా లోకేష్ అన్నారు.

**చంద్రమోహన్ మృతి బాధాకరం** : సీనియర్ నటులు చంద్రమోహన్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ ఉదయం కన్నుమూసిన విషయం తెలిసిందే. చంద్రమోహన్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులంతా స్పందిస్తున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ట్విటర్ వేదికగా స్పందించారు. చంద్రమోహన్ మృతి బాధాకరమన్నారు. "హీరోగా, కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రలు అలవోకగా పోషించిన నటుడు చంద్రమోహన్ గారి మరణం తెలుగు చలనచిత్ర పరిశ్రమకి తీరని లోటు. వారి ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబసభ్యులకి నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను" అని నారా లోకేష్ పేర్కొన్నారు.




తిరువనంతపురం: టెక్నాలజీ మాటున జరుగుతున్న మరో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. డీప్ ఫేక్ టెక్నాలజీ సాయంతో స్నేహితుడి ముసుగు తొడిగి ఓ నేరగాడు కోల్ ఇండియా మాజీ ఉద్యోగికి టోకరా వేశాడు. చెల్లెలికి సర్జరీ అంటూ రూ.40వేలు దోచేశాడు. మరింత దోచుకోవడానికి ప్రయత్నించే క్రమంలో మోసం అని గ్రహించిన సదరు విశ్రాంత ఉద్యోగి.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఒకరిని పోలీసులు అరెస్ట్ చేయగా.. ప్రధాన నిందితుడు ఆచూకీ దొరకాల్సి ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళకు చెందిన పీఎస్ రాధాకృష్ణన్ కొయ్‌కోడ్‌లో నివాసముంటున్నారు. కోల్ ఇండియా మాజీ ఉద్యోగి అయిన రాధాకృష్ణన్‌కు ఈ ఏడాది జులై 9న ఉదయం గుర్తు తెలీని నంబర్ నుంచి వాట్సప్‌లో వరుస మెసేజ్‌లు వచ్చాయి. తనతో పాటు నాలుగు దశాబ్దాలుగా పనిచేసిన వేణుకుమార్ ఫ్యామిలీ ఫొటోలు అవి. అవి చూస్తుండగానే ఓ వాట్సాప్ కాల్. 'నేను వేణుని. ప్రస్తుతం దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో ఉన్నా. సాయంత్రానికి ముంబయి చేరుకుంటా. చెల్లెలికి సర్జరీ ఉంది. ఓ రూ.40వేలు సర్దగలవా" అంటూ విన్నపం. ఏళ్లుగా పరిచయం ఉన్న వ్యక్తి.. పైగా ఆపత్కాలంలో సాయం అడుగుతున్నాడు.. చేయాలా? వద్దా? వద్దా అనే మీమాంసలో ఉండగా.. మళ్లీ అంతలోనే వీడియో కాల్. ఎదురుగా తనకెంతగానో పరిచయం ఉన్న వేణు కుమార్ ఫోన్‌లో ప్రత్యక్షమయ్యాడు. ఇక అంతే అవతలి ఉన్న వ్యక్తి వేణూనే అని ధ్రువీకరించుకుని అతడు చెప్పిన ఖాతాకు రూ.40వేలు బదిలీ చేశాడు. గంటల వ్యవధిలో రెండోసారి మరో రూ.35 వేలు కావాలంటూ అడగడంతో అనుమానం వచ్చిన రాధాకృష్ణన్.. కోల్ ఇండియా మాజీ ఉద్యోగుల వాట్సాప్ గ్రూప్ ఓపెన్ చేసి అందులో ఉన్న వేణు కుమార్ నంబర్‌కు ఫోన్ చేశాడు. అవతలి నుంచి చాలా రోజుల తర్వాత ఫోన్ చేసిన మిత్రుడితో పిచ్చాపాటీగా మాట్లాడడం మొదలుపెట్టడంతో రాధాకృష్ణన్‌కు ఆశ్చర్యం వేసింది. దీంతో జరిగిందంతా చెప్పాడు. మోసపోయానని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

**మోసం ఇలా..** రాధాకృష్ణన్ ఇచ్చిన ఫిర్యాదుతో సిటీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీడియో కాల్ ద్వారా డీప్‌ఫేక్ టెక్నాలజీ సాయంతో ఈ మోసం జరిగిందని గుర్తించారు. అహ్మదాబాద్‌కు చెందిన కౌశల్ షాను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. నేర చరిత్ర ఉన్న కౌశల్.. రాధాకృష్ణన్ నుంచి కొట్టేసిన సొమ్మును తెలివిగా ఓ గ్యాంబ్లింగ్ సంస్థ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత ఆ మొత్తాన్ని తన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. మూలాలు దొరక్కుండా ఉండేందుకు కౌశల్ ఈ పనిచేశాడని పోలీసులు తెలిపారు. బాధితుడి కంపెనీ ఉద్యోగుల వాట్సాప్ గ్రూప్ నుంచి ఈ వివరాలు తస్కరించి మోసానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు ఈ కేసులో షేక్ ముర్తుజామియా భాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పేదల పేరిట నకిలీ బ్యాంక్ అకౌంట్లు తెరిచి విక్రయించే షేక్.. బ్యాంక్ ఖాతా విషయంలో కౌశల్‌కు సహాయపడినట్లు గుర్తించారు. గుజరాత్‌లో అతడిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. డీప్‌ఫేక్ టెక్నాలజీ సాయంతో ఈ తరహా మోసం జరగడం ఇదే తొలిసారి అని పోలీసులు తెలిపారు.

# రైలెక్కేందుకు పోటెత్తిన ప్రయాణికులు.. ఒకరి మృతి!



గాంధీనగర్: రైలెక్కేందుకు పెద్దఎత్తున ప్రయాణికులు పోటెత్తడంతో గందరగోళ పరిస్థితులు తలెత్తి ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. గుజరాత్‌లోని సూరత్ రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఛఠ్ పండగ నేపథ్యంలో స్వస్థలాలకు వెళ్లేందుకుగానూ పెద్దఎత్తున ప్రయాణికులు శనివారం సూరత్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో స్టేషన్ కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలోనే బిహార్‌కు వెళ్లే రైలు ప్లాట్‌ఫాంపైకి చేరుకుంది. దీంతో ప్రయాణికులంతా ఒక్కసారిగా రైలు ఎక్కేందుకు యత్నించడంతో.. గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలోనే పలువురు స్పృహతప్పి పడిపోయారు. రైల్వేస్టేషన్‌లో విపరీతమైన రద్దీ ఉందని, దీని కారణంగా కొంతమంది ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురైనట్లు పోలీసులు వెల్లడించారు. తొక్కిసలాటతో కిందపడిపోయిన ప్రయాణికుల్లో ఒకరికి గుండె సంబంధిత సమస్య తలెత్తిందని, అతడికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడిని అంకిత్ వీరేంద్ర సింగ్‌గా గుర్తించారు. మరో ఇద్దరు ప్రయాణికులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారని, వారు ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్‌లో పరిస్థితులను నియంత్రించేందుకు పోలీసులు తమవంతు ప్రయత్నం చేశారని హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. సూరత్‌లోని వజ్ర, వస్త్ర పరిశ్రమల్లో పనిచేసే వేలాది వలస కార్మికులు ఏటా ఛఠ్ పూజ సమయంలో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని తమ స్వస్థలాలకు వెళ్తుంటారు. పండగ సీజన్‌లో రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడపడంతోపాటు స్టేషన్‌లలో రద్దీ నిర్వహణ, భద్రత, అదనపు సిబ్బంది మోహరింపు వంటి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పశ్చిమ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.







# గాజాపై దాడులు ఆపాలన్న మేక్రాన్.. తీవ్రంగా స్పందించిన ఇజ్రాయెల్

ఇజ్రాయెల్-హమాస్ మధ్య పోరుతో గాజాలోని సామాన్య ప్రజల బతుకు ఛిద్రమవుతోంది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. గాజాపై ఇజ్రాయెల్ చేస్తోన్న దాడులను వెంటనే ఆపాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ పిలుపునిచ్చారు. ఓ అంతర్జాతీయ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విధంగా స్పందించారు. దీనిపై ఇజ్రాయెల్ నుంచి ఘాటు స్పందన వచ్చింది. 'ఈ దాడులు ఏ మాత్రం సమర్థనీయం కాదు. కాల్పులు విరమణ ఇజ్రాయెల్‌కు ప్రయోజనం చేకూరుస్తుంది. ఉగ్రవాద చర్యలను ఫ్రాన్స్ ఏ మాత్రం సహించదు. ఇజ్రాయెల్‌కు తనను తాను రక్షించుకునే హక్కు ఉంది. అదే సమయంలో ఆ దేశం గాజాలో బాంబుదాడులను ఆపాలని మేం కోరుతున్నాం' అని మేక్రాన్ అన్నారు. కాల్పుల విరమణ కోసం యూఎస్, బ్రిటన్ కూడా తమతో కలిసివస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. గాజాలోని పరిస్థితులపై పారిస్‌లో మానవతా సదస్సు జరిగిన నేపథ్యంలో మేక్రాన్ నుంచి ఈ స్పందన వచ్చింది. అయితే మేక్రాన్ ఇచ్చిన పిలుపుపై ఇజ్రాయెల్ తీవ్రంగా బదులిచ్చింది. 'ప్రపంచదేశాలు ఇజ్రాయెల్‌ను కాదు.. హమాస్ చర్యల్ని ఖండించాలి. హమాస్ మా దగ్గర పాల్పడుతోన్న నేరాలు.. రేపు పారిస్, న్యూయార్క్‌లోనూ జరగొచ్చు' అని ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే.. ఇజ్రాయెల్ భీకర దాడులతో ఎంతోమంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారని, అక్కడి ప్రజలను రక్షించడానికి, మానవతా సాయం అందించడానికి మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ అన్నారు.

భారత్-అమెరికాల రక్షణ, విదేశాంగ మంత్రుల ఐదో విడత '2o2 చర్చలు' శుక్రవారం దిల్లీలో జరిగాయి. ఈ క్రమంలోనే బ్లింకెన్ స్పందించారు. ఈ చర్చల అనంతరం ఇరు దేశాల మంత్రులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 'ఉగ్రవాదంపై పోరు విషయంలో ఇజ్రాయెల్‌కు బాసటగా నిలుస్తున్నాం. పౌరులను రక్షించే విషయంలో అంతర్జాతీయ మానవతా చట్టానికి కట్టుబడాలి. బందీలను వెంటనే విడుదల చేయాలి' అని ప్రకటనలో పేర్కొన్నారు.




హైదరాబాద్: ప్రముఖ నటుడు చంద్రమోహన్ (82) ఇకలేరు. హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన శనివారం (నవంబరు 11) తుదిశ్వాస విడిచారు. దీంతో తెలుగు చిత్రసీమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. చంద్రమోహన్‌కు భార్య జలంధర, ఇద్దరు కుమార్తెలున్నారు.

**సోమవారం అంత్యక్రియలు..** ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసానికి చంద్రమోహన్ పార్థివదేహాన్ని తరలించారు. అమెరికాలో ఉన్న చిన్న కుమార్తె మధుర మీనాక్షి వచ్చాక సోమవారం మధ్యాహ్నం తర్వాత చంద్రమోహన్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన మేనల్లుడు కృష్ణప్రసాద్ తెలిపారు. " నాలుగేళ్ల నుంచి చంద్రమోహన్ హృద్రోగ సమస్యతో బాధపడుతున్నారు. చికిత్స తీసుకుంటుండగా కిడ్నీలపై కూడా ప్రభావం పడింది. ఈరోజు ఉదయం 8 గంటలకు అపోలో ఆస్పత్రికి తరలించాం. ఉదయం 9.45 గంటలకు చంద్రమోహన్ మృతి చెందారు" అని కృష్ణప్రసాద్ తెలిపారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 1943 మే 23న జన్మించిన చంద్రమోహన్ అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర్ రావు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. 1966లో రంగుల రాట్నం సినిమాతో అరంగేట్రం చేశారు. పలు తమిళ సినిమాల్లోనూ నటించారు. హీరోగానే కాకుండా కమెడియన్, సహాయనటుడిగానూ ఆయన విభిన్న పాత్రలు పోషించారు. 'ఆత్మీయులు', 'తల్లిదండ్రులు', 'సంబరాల రాంబాబు', 'జీవన తరంగాలు', 'గంగామంగా', 'అల్లూరి సీతారామరాజు', 'సిరి సిరి మువ్వ', 'సీతా కల్యాణం', 'శుభోదయం', 'పక్కింటి అమ్మాయి', 'రాధా కల్యాణం', 'ఇంటి గుట్టు', 'సువర్ణ సుందరి', 'ఆఖరి పోరాటం' 'ఆదిత్య 369', 'పెద్దరికం', 'గులాబి', 'చంద్రలేఖ', 'ఇద్దరు మిత్రులు', '7జీ బృందావన్ కాలనీ', 'ఢీ', 'కింగ్', 'లౌఖ్యం' వంటి చిత్రాల్లో ఆయన నటించారు. తన నటనకు గానూ ఫిలింఫేర్, నంది అవార్డులు అందుకున్నారు. 'పదహారేళ్ల వయసు', 'సిరి సిరి మువ్వ' సినిమాల్లో ఆయన నటనకు ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డులు దక్కాయి. 1987లో 'చందమామ రావే' సినిమాకు ఉత్తమ హాస్యనటుడిగా నంది అవార్డు, 2005లో 'అతనొక్కడే' సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు.

చివరగా 2017లో 'ఆక్సిజన్' సినిమాలో కన్పించారు. దివంగత దర్శకుడు కె. విశ్వనాథ్‌కు చంద్రమోహన్ సమీప బంధువు.




హైదరాబాద్: సీనియర్ నటుడు చంద్రమోహన్ మరణంతో చిత్ర పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతున్నారు. "ప్రముఖ తెలుగు సినీనటుడు చంద్రమోహన్ పరమపదించారని తెలిసి ఎంతో విచారించా. నాటి చిత్రాలు మొదలుకొని నిన్న మొన్నటి చిత్రాల వరకూ నటుడిగా వారి ప్రాధాన్యత ఎనలేనిది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా" - **మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

"సిరిసిరిమువ్వ', 'శంకరాభరణం', 'రాధాకళ్యాణం', 'నాకూ పెళ్ళాం కావాలి' లాంటి అనేక ఆణిముత్యాల్లాంటి చిత్రాల్లో తన వైవిధ్య నటనా కౌశలంతో తెలుగువారి మనసులో చెరగని ముద్ర వేసిన సీనియర్ నటుడు, కథానాయకుడు చంద్రమోహన్ గారు ఇక లేరన్న వార్త ఎంతో విషాదకరం. నా తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు'లో ఒక మూగవాడి పాత్రలో అత్యద్భుతమైన నటన ప్రదర్శించారాయన. ఆ సందర్భంగా ఏర్పడిన మా తొలి పరిచయం, ఆ తర్వాత మంచి స్నేహంగా, మరింత గొప్ప అనుబంధంగా మారింది. ఆయన సాన్నిహిత్యం ఇక లేకపోవటం నాకు వ్యక్తిగతంగా తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా" – **చిరంజీవి**

"ఎన్నో దశాబ్దాలుగా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న చంద్రమోహన్ గారి అకాల మరణం బాధాకరం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా" – **ఎన్టీఆర్**

"సీనియర్ నటుడు చంద్రమోహన్ మృతి బాధాకరం. హీరో, కమెడియన్, సహాయ నటుడిగా విభిన్న పాత్రలు అలవోకగా పోషించిన ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను." – **నారా లోకేశ్**

"ఆయన మోము మనకు అద్భుతమైన జ్ఞాపకాలు గుర్తుచేస్తుంది. ఆయన చిరస్మరణీయమైన నటన, అద్భుతమైన పాత్రలతో ప్రతిసారీ మన పెదవులపై చిరునవ్వు విరుస్తుంది" – **సాయి ధరమ్ తేజ్**

"విలక్షణ నటుడు చంద్రమోహన్ అకాల మరణం సినిమా జగత్తుకు తీరని లోటు. ఆయనతో పలు సినిమాల్లో కలిసి నటించి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి" – **కల్యాణ్ రామ్**

# ఒక్కసారి అవకాశం ఇస్తే ఏపీని తెలంగాణకు తాకట్టు పెట్టేశారు



గుంటూరు: అధికారం ఉంటే రాష్ట్రాన్ని ఎలా దోచేయవచ్చో జగన్ నిరూపించారని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 16 నెలల పాటు జైల్లో ఉండి ఎలా దోచుకోవచ్చో రీసెర్చి చేశారన్నారు. ఏపీని జగన్ సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ఏపీకి జగన్ ఎందుకు అవసరం లేదో వంద కారణాలు చెబుతామని.. వంద కారణాలతో పుస్తకం వేస్తామని తెలిపారు. పోలవరం కట్టలేదని, రాజధాని లేకుండా చేశారని విరుచుకుపడ్డారు. ఒకసారి అవకాశం ఇస్తే ఏపీని తెలంగాణకు (%ఱవశ్రీఖఅస్త్రుఖఅఖ ఖ్ఞవ%) తాకట్టు పెట్టారని ఆరోపించారు. మరోసారి అవకాశం ఇస్తే బ్రిటీష్ వాడికి అమ్మేస్తారని ఆయన వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నాసిరకం సారా అమ్ముకుంటూ తాగుబోతులను పెంచారన్నారు. దళితులకు జగన్ చేసినంత ద్రోహం ఇంకే ముఖ్యమంత్రి చేయలేదన్నారు. విశాఖలో భూములు కొట్టేయడానికే కొత్త అసైన్మెంట్ చట్టం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను భయపెట్టి బానిసలుగా చేస్తున్నారని.. మీడియా సమావేశం పెడితే పోలీసులను కాపలా పెట్టారని తెలిపారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో స్వేచ్ఛగా బ్రతకాలన్నా రాష్ట్రపతి పాలన కావాలన్నారు. ఒక్క తడికి నీళ్లు ఇవ్వలేని మంత్రి అంబటి పోసుకోలు ముచ్చట్లు చెబుతారని కన్నా లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# మాధురి దీక్షిత్ లా ఎప్పటికీ నవయవ్వని!


సూపర్ స్టార్ మహేష్ సతీమణి నమ్రతశిరోద్కర్ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటారో తెలిసిందే. నిత్యం ఫ్యామిలీ విషయాలు షేర్ చేస్తూ అభిమానుల్ని అలరిస్తుంటారు. అయితే ఈ మధ్య కాలంలో నమ్రత కూడా గేర్ మార్చినట్లు కనిపిస్తుంది. ఇన్ స్టా యాక్టివిటీని మరింత స్పీడప్ చేసినట్లు కనిపిస్తుంది. కుమార్తె సితార తరహాలో నమ్రత కూడా నేను సైతం అంటున్నారు. సితార ఫోటోలతో పాటు నమ్రత ఫోటో షూట్లు సైతం తరుచూ దర్శనమిస్తున్నాయి. డిజైనర్ దుస్తుల్లో నమ్రత నవ నాయికలకు ఏమాత్రం తగ్గకుండా రేసులో నిలుస్తున్నారు. తాజాగా మరో కొత్త ఫోటోతో నెటి జనుల ముందుకొచ్చేసారు. ఇదిగో ఇక్కడిలా అల్ట్రామెడ్రన్ దుస్తుల్లో ఆకర్షిస్తున్నారు. క్రీమ్ కలర్ డిజైన్ లో నమ్రత ఓ ఈవెంట్ కి



హాజరైనప్పుడు ఇలా ముస్తాబై వెళ్లారు. నమ్రత ఎంపిక చేసుకున్న యాక్సరసీస్ మరింత బ్యూటీని జోడించాయి. కాళ్లకు మ్యాచింగ్ నలుపు రంగు బూట్లు ధరించి స్టైల్ కా బాప్ అనిపించేలా కొన్ని భంగిమల్లో కెమారాకి ఫోజులిచ్చారు. యాభై ఏళ్ల వయసులోనూ నమ్రత మాధురి దీక్షిత్ లా ఎప్పటికీ మరువని నాయిక అంటూ కొత్త ట్యాగ్ ని సొంతం చేసుకుంటున్నారు. నిజానికి నమ్రత చేసింది కొన్ని సినిమాలే. మహేష్ ని వివాహం చేసుకున్న తర్వాత పూర్తిగా ఫ్యామిలీ ఉమెన్ గా మారిపోయారు. అవకాశాలు వచ్చినా..ఇచ్చినా మళ్లీ కెమెరా ముందుకు వచ్చేదే? లేదని ఎన్నోసార్లు కుండబద్దలు కొట్టి చెప్పారు. చాలా కాలం పాటు మీడియాకి కూడా దూరంగా ఉన్నారు. కానీ ఇప్పుడు అదే మీడియాలో ఎక్కువగా ఫోకస్ అవుతుండటం ఇంట్రెస్టింగ్. ప్రస్తుతం ఈఫోటో నెట్టింట వైరల్ గా మారింది. న్యూ డిజైన్ లో చూసిన అభిమానులు లైక్ లు.. షేర్లతో ఆకట్టుకుంటున్నారు. కామెంట్ బాక్స్ లో పోస్టులు అంతే ఆసక్తికరం.

# మగాడా? కాదా? అన్నది పెళ్లికి ముందే తెలుసుకోవాలి!

సంచలనాల రాంగోపాల్ వర్మ ఒక్కడే వివాదాస్పదుడు అంటే తప్పు! ఆయనతో పాటు ఆయన పరిచయం చేసిన హీరోయిన్లు కూడా కొందరు ఆయనలాగే ఉన్నారని కొంత మంది భామల్లో ప్రూవ్ అయింది. అందుకే వర్మ పల్స్ పట్టుకుని జర్నీ చేయగల్గుతున్నారు. అందాల ప్రదర్శన పక్కనబెడితే ఆయన తరహాలోనే అప్పుడప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలతోనూ మీడియాలో హైలైట్ అవుతుంటారు. తాజాగా హాట్ బ్యూటీ శ్రీరాపాక పెళ్లికి ముందు శృంగారం గురించి బోల్డ్ గా మాట్లాడింది. మ్యారేజ్ కి ముందు శృంగారంలో పాల్గొనడంలో తప్పులేదని.. అందులో పాల్గొంటేనే అతను మగాడా? కాదా? అనే విషయం తెలుస్తుందని అంది. పెళ్లి జరిగిన తర్వాత అతను మగాడు కాదని తెలిస్తే జీవితాంతం బాధ పడాల్సి వస్తుంది. అదే విషయం పెళ్లికి ముందే తెలిస్తే ఆ జీవితం మరోలా ఉంటుందంది. దీనికి సాక్షంగా తన స్నేహితురాలి జీవితాన్ని ఉదహరించింది. ఇదే



సమయంలో తన స్నేహితురాలికి జరిగిన ఒక అనుభవం గురించి తెలిపింది. -నా స్నేహితురాలు పెళ్లి చేసుకుంది. తొలి రాత్రి అతడు గే అని తెలిసింది. ఈ విషయం నాకు చెప్పి నా స్నేహితురాలు ఎంతో బాధపడింది. ఈరోజుల్లో ఇలాంటి వాటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి ఘనటలు రోజు పేపర్లో...టీవీలో వస్తునే ఉన్నాయి. రకరకాల కారణాలతో భార్యభర్తల బంధాలు వీగిపోతున్నాయి. విదేశీ సంబంధాలు అంటూ అలాగే మోసపోతున్నారు. అబ్బాయిలది మాత్రమే తప్పు అనలేదు. అమ్మాయిలు అలాగే ఉన్నారు. రకరకాల కారణాలతో వివాహ వ్యవస్తలు కూలిపోతున్నాయి. ఈ విధానం మారాలని నేను కోరుకుంటున్నా - అని తెలిపింది. వర్మ దర్శకత్వం వహించిన -నగ్నం- సినిమాతో ఈ బ్యూటీ పాపులర్ అయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అమ్మడు సోషల్ మీడియా లో మంచి ప్రాచుర్యం పొందింది. టెంప్టింగ్ ఫోటోలతో యువతని ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటుంది. అప్పుడప్పుడు ఇలా వర్మ తరహా కామెంట్లతోనూ ఆసక్తికరంగా మారుతుంది.





# సీనియర్లు అంతా నో రిబేట్ పాలసీ!



ఇండస్ట్రీలో హీరోయిన్లకు ఏమాత్రం కొదవలేదు. రోజుకో భామ దిగుమతి అవుతుంది. సక్సెస్ అయిన వారంతా రేసులో దూసుకుపోతుంటారు. కానీ వారంతా మరో ఆప్షన్ తో ముందుకెళు ంటారు. ఏదో రకంగా బిజీ అయ్యే ప్రయత్నం చేస్తుంటారు. ఏటూ కాని వారు ఎలా వచ్చారా? అలిగే టిటర్న్ టికెట్ వేసుకుం టారు. కానీ మేము మాత్రం లోకల్ అంటూ కొందరు సీనియర్ భామలు భామలు మాత్రం పారితోషికం పరంగా ఏమాత్రం తగ్గలేదు. డిమాండ్ ఉన్నా? లేకపోయినా డిమాండ్ ని క్రియేట్ చేసుకుంటున్నారు. అందులో ముఖ్యంగా నలుగురైదుగురు సీనియర్ భామలు కనిపిస్తున్నారు. అనుష్క శెట్టి ఇటీవలే మిసెస్ శెటి మిస్టర్ పోలిశెట్టితో ప్రేక్షకుల ముందుకొచ్చింది. చాలా గ్యాప్ తర్వాత చేసిన సినిమా. ఈసినిమాకి ముందు ఆమె సినిమాలు ఎందుకు చేయలేదు? ఇప్పుడు ఎందుకంత వేగంగా టాలీవుడ్ లో మూవ్ కాలేదు? అన్న సంగతి తెలియదు గానీ అమ్మడు మాత్రం మార్కెట్ డిమాండ్ తగ్గలేదని వినిపిస్తుంది. తాను ఇప్పుడే సినిమా కమిట్ అయిన పారితోషికం పాత లెక్కల ప్రకారమే అందుకుంటుంది. మిసెస్ శెట్టి..మిస్టర్ పొలిశెట్టికి ఐదు కోట్లకు పైగానే అందుకుందని సమాచారం. అలాగే మాలీవుడ్ లో కూడా లాంచ్ అవుతుంది. అక్కడ మాత్రం డెబ్యూ కావడంతో కాస్త తగ్గినట్లు సమాచారం. తెలుగులో కొత్తగా ఏ సినిమా చేయాలన్నా? నా లెక్క నాకుందంటోందిట. అలాగే అమెరికాలో ఉన్న సమంత బాలీవుడ్ లో బిజీ అయ్యే క్రమంలో టాలీవుడ్ ని లైట్ తీసుకుంది. కానీ పారితోషికం రెట్టింపు ఇస్తే నో అనే ఛాన్స్ లేదని వినిపిస్తుంది. ఇక్కడ సినిమాలు చేసినా? చేయక పోయినా సామ్ మాత్రం మూడు కోట్లకు పైగానే ఛార్జ్ చేసేలా ఫిక్స్ అయిందిట. అలాగే రష్మిక మందన్న.. పూజాహెగ్దే కూడా 3 కోట్లకు తగ్గలేదు. కొత్త కమిట్ మెంట్ ఏదైనా తన రెమ్యునరేషన్ కమిట్ మెంట్ 3 స్టార్ అంటున్నారు. ఇక శృతిహాసన్ కూడా రెండు కోట్లకు తగ్గనంటోందిట.

అమ్మడి కెరీర్ తెలుగులో స్లోగా ఉన్నా! డిమాండ్ విషయంలో మాత్రం తగ్గలేదని వినిపిస్తుంది. అలాగే చందమామ కాజల్ అగర్వాల్ తాజాగా భగవంత్ కేసరి తో భారీ విజయం ఖాతాలో వేసుకుంది. ఇప్పటి వరకూ రిబేట్ ఇస్తుందని కొంత మంది నిర్మాతలు ఆశించినా తాజా సక్సెస్ తో అది జరిగే పని కాదని తేలిపోయింది. లేడీ ఓరియేంటెడ్ అవకాశాలతో పాటు.. సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ కావడంతో కాజల్ వేగాన్ని అపడం కష్టమైన పనే.

# పూజా అప్డేట్ కోసం ఫ్యాన్స్ వెయిటింగ్..!



బుట్ట బొమ్మ పూజా హెగ్దే మొదట్లో సౌత్ నార్త్ అన్ని చోట్ల సినిమాలు చేసినా ఆమెకు మొదటి హిట్ ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. అల్లు అర్జున్ తో నటించిన దువ్వాడ జగన్నాథం సినిమా పూజా హెగ్దే కెరీర్ లో ఫస్ట్ హిట్ సినిమాగా నిలిచింది. అయితే అప్పటికే టాలీవుడ్ లో హీరోయిన్స్ కొరత బాగా ఉండటం వల్ల అమ్మడికి వరుస సినిమా ఆఫర్లు వచ్చాయి. స్టార్ సినిమాల్లో కావాల్సిన గ్లామర్ ట్రీట్ కూడా అమ్మడు అందించడం వల్ల పూజా సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. టాలీవుడ్ లో ఉన్న స్టార్స్ అందరితో నటించిన పూజా హెగ్దే తెలుగులో టాప్ హీరోయిన్ గా పాపులారిటీ సాధించింది. అయితే అమ్మడు ఇప్పటికీ మంచి ఫాంలో ఉన్నా సరే సడెన్ గా అవకాశాలు లేక ఖాళీ అయిపోయింది. మహేష్ తో గుంటూరు కారం లో మొదట హీరోయిన్ గా పూజా హెగ్దేని అనుకున్నా సరే ఆమె ఇచ్చిన డేట్స్ లో సినిమా షూటింగ్ వాయిదా పడటం ఆ తర్వాత డేట్స్ అడ్జెస్ట్ చేయలేక సినిమా వదులుకోవడం జరిగిందట. అయితే తీసుకున్న అడ్వాన్స్ కి న్యాయం చేయడం కోసం పూజా హెగ్దే గుంటూరు కారం సినిమాలో ఐటెం సాంగ్ చేయడానికి ఓకే చెప్పిందట. గుంటూరు కారం సరే మిగతా స్టార్స్ ఎందుకు పూజా కు ఛాన్స్ ఇవ్వట్లేదు అన్నది డిస్కషన్స్ లోకి వస్తుంది. అయితే స్టార్స్ అంతా కూడా ప్రస్తుతం వారు చేస్తున్న సినిమాల్లో హీరోయిన్స్ ని ఫిక్స్ చేసుకున్నారు. కమిటైన సినిమాలు పూర్తైతే తమ నెక్ట్స్ సినిమాలో పూజా బేబిని తీసుకునే అవకాశం ఉంది. తెలుగులో ఇప్పటికీ సూపర్ క్రేజ్ ఉన్న పూజా హెగ్దే ఆఫర్ల కోసం ఎదురుచూస్తుంది. పూజా సినిమా అప్డేట్ కోసం ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అమ్మడు రెండు మూడు సినిమాల డిస్కషన్స్ లో ఉందని తెలుస్తుంది. బుచ్చి బాబు చరణ్ కాంబోలో వస్తున్న సినిమాతో పాటుగా ఎన్.టి.ఆర్ ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో పూజా హెగ్దేని హీరోయిన్ గా తీసుకోవాలని చూస్తున్నారట. ఆ సినిమాలు ఓకే అయితే మాత్రం పూజా రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పటికే సినిమాకు 2 నుంచి 3 కోట్ల దాకా డిమాండ్ చేస్తున్న పూజా పాన్ ఇండియా హిట్లు పడితే మాత్రం ఆ రేటు పెంచే అవకాశం ఉంది.

# రాహుల్ సిప్లిగంజ్.. నీ అయ్య నా మామ

వెస్ట్రన్ బీట్స్ కి తెలంగాణ ఫోక్స్ మిక్స్ చేస్తే కచ్చితంగా అది కొత్త ప్రయోగం అవుతుంది. అలాంటి ప్రయోగాలు ఎక్కువగా ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ చేస్తూ ఉంటారు. బస్తీ నుంచి ఆస్కార్ వేదికపైకి వెళ్లి పాట పాడే అరుదైన సొంతం చేసుకున్నారు. అలాగే ఇండియాలో ఆస్కార్ అవార్డు అందుకున్న సాంగ్ పాడిన గాయకుడిగా కూడా అరుదైన ఘనత దక్కించుకున్నాడు. బిగ్ బాస్ విన్నర్ గా అతనికి వచ్చిన ఇమేజ్ కంటే ఆస్కార్ విన్నింగ్ సాంగ్ గాయకుడిగా ఎక్కువ ఫేం వచ్చింది. టాలీవుడ్ లో స్టార్ సింగర్ ఇప్పుడు రాహుల్ దూసుకుపోతున్నాడు. మరో వైపు తానే ఒక ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసి ప్రైవేట్ సాంగ్స్ ని చేస్తున్నాడు. ఆర్ఎస్ ఎంటర్టైన్మెంట్స్ తో తాజాగా నీ అయ్యా నా మామ అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. ఈ సాంగ్ షూటింగ్ మొత్తం దుబాయ్ లోనే షూట్ చేయడం



విశేషం. వెస్ట్రన్ అందాలతో పాటు హాట్ మోడల్స్ తో వెస్ట్రన్ స్టైల్ మ్యూజిక్ బీట్ లోనే కాశర్ల శ్యామ్ రాసిన సాంగ్ ని ఆవిష్కరించాడు. తానే సాంగ్ లో నటించి రాహుల్ సిప్లిగంజ్ పాడటం విశేషం. ఈ సాంగ్ ప్రస్తుతం ట్రెండింగ్ లో దూసుకుపోతోంది. వెస్ట్రన్ అందాలతో ఈ సాంగ్ లో అద్భుతమైన విజువల్స్ తో ప్రెజెంట్ చేశారు. సినిమాకి ఏ మాత్రం తక్కువ కాకుండా విజువల్స్ చూపించడం విశేషం. ఈ సాంగ్ లో రాహుల్ కి జోడీగా జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ నటించింది. రాహుల్ ఓ వైపు అదిరిపోయే డాన్స్ తో తెలంగాణ మాండలికంలో పడికట్టు పదాలతో కాశర్ల శ్యామ్ రాసిన పాటని అద్భుతంగా ఆలపించడం విశేషం. ఈ సాంగ్ రిలీజ్ చేసిన వెంటనే వైరల్ అయిపొయింది. తెలంగాణ స్లాంగ్ లో పడికట్టు పదాలకి సాంగ్ తో రాహుల్ అందం తీసుకొచ్చాడని నెటిజన్లు నుంచి కామెంట్స్ వినిపిస్తున్నాయి. గురువారం రాహుల్ సిప్లిగంజ్ తన యుట్యూబ్ ఛానల్ లో సాంగ్ రిలీజ్ చేయగా ఇప్పటి వరకు 2 లక్షలకి పైగా వ్యూస్ సొంతం చేసుకుంది. రాహుల్ ఫ్యాన్స్ అందరూ ట్విట్టర్ లో ఈ సాంగ్ ని షేర్ చేస్తున్నారు. విజువల్ లో బికినీ షూట్ లలో ఫారిన్ భామల అందాలతో అద్భుతంగా ఆవిష్కరించడంతో సాంగ్ కలర్ ఫుల్ గా ఉందనే మాట వినిపిస్తోంది.

# 47లో బద్రి హీరోయిన్ కు బిగ్ హిట్

పవన్ కళ్యాణ్ భద్రి సినిమాలో హీరోయిన్ గా చేసిన అమీషా పటేల్ ని అంత ఈజీగా ఎవరూ మరిచిపోరు. ఆమె కెరియర్ ఆరంభంలో భద్రి సినిమాలో నటించి సూపర్ హిట్ అందుకుంది. తరువాత హిందీలో గద్దర్ మూవీతో హిట్ పడటంతో స్టార్ హీరోయిన్ గా మారిపోయి అక్కడ వరుస అవకాశాలతో దూసుకుపోయింది. ఏకంగా దశాబ్ద కాలం స్టార్ హీరోయిన్ గా బాలీవుడ్ లో చక్రం తిప్పింది. తెలుగులో కూడా మధ్యలో మహేష్ బాబుతో నాని, ఎన్టీఆర్ తో నారసింహుడు సినిమాలలో నటించింది. ఈ రెండు డిజాస్టర్ అయ్యాయి. రెండు దశాబ్దాలుగా హీరోయిన్ గా తన ప్రస్తానం కొనసాగిస్తోన్న ఈ అందాల భామ లేటు వయస్సులో ఇన్ స్టాగ్రామ్ లో హాట్ బాంబ్ గా మారిపోయింది. కుర్ర హీరోయిన్స్ కి పోటీ ఇస్తూ అందాల ప్రదర్శనలో ఎలాంటి హద్దులు పెట్టుకోకుండా తనని తాను షోకేస్ చేసుకుంటోంది. 47 ఏళ్ళ వయస్సులో వన్నె తగ్గని అందాలతో అమీషా పటేల్ చేసే గ్లామర్ షోకి విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. ఇంత వయస్సు వచ్చిన ఆమె ఇంకా పెళ్లి చేసుకోలేదు. నటిగానే



కెరియర్ ని మరింత బిల్డ్ చేసుకునే పనిలో ఉన్నారు. తాజాగా గద్దర్ కి సీక్వెల్ గా వచ్చిన గద్దర్ 2తో ఆమె మళ్ళీ హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ సినిమాలో సన్నీడియోల్ హీరో. 2001లో లవ్ అండ్ యాక్షన్ మూవీగా గద్దర్ వచ్చింది. దానికి సీక్వెల్ గానే గద్దర్ 2 తాజాగా రిలీజ్ అయ్యింది. మొదటి సినిమా హిట్ కారణంగా సీక్వెల్ పైన మంచి హైప్ ఉంది. దీంతో అవుట్ డేటెడ్ యాక్టర్స్ అయిన కూడా మొదటి రోజు ఈ చిత్రం ఏకంగా 40 కోట్లు కలెక్ట్ చేసింది. అయితే ఈ సినిమా కథ, కథనం కూడా రొటీన్ స్టైల్ లో ఉందనే మాట వినిపిస్తోంది. వీకెండ్ మూడు రోజులు ఈ చిత్రానికి కొంత వరకు ఆదరణ వస్తుందని భావిస్తున్నారు. ఈ మూవీ హిట్ అయితే మాత్రం అమీషా పటేల్ కి మళ్ళీ నటిగా అవకాశాలు పెరిగే ఛాన్స్ అయితే ఉంది. హీరోయిన్ గా కాకపోయిన మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలు దొరుకుతాయి. మరి అమీషా పటేల్ కి గద్దర్ 2 ఏ విధంగా ఉపయోగపడుతుందనేది చూడాలి.




హైదరాబాద్: కరెంటు కావాలా?కాంగ్రెస్ కావాలా? తెలంగాణ రైతులు ఆలోచన చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ సూచించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "రైతులకు ఉచిత కరెంటు ఎందుకని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు. 70 లక్షల మంది రైతులు బిచ్చగాళ్లని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేతల తీరుతో రైతులు తిరిగి ఆగమవుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బావి వద్ద నిద్రపోయిన రోజులు రైతులు గుర్తు చేసుకోవాలి. కాంగ్రెస్ పాలనలో కోతలు లేని విద్యుత్ సరఫరా ఉండేదా? రైతులకు 3గంటల కరెంటు చాలని కాంగ్రెస్ చెబుతోంది. ఇప్పుడిప్పుడే తెలంగాణ రైతులు బాగుపడుతుంటే.. రైతులపై కాంగ్రెస్‌కు ఎందుకు ఇంత కక్ష. 24 గంటల కరెంటు వద్దన్న కాంగ్రెస్‌ను ఊరి పొలిమేరల దాకా తరిమికొట్టాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా. 24 గంటల విద్యుత్‌పై కాంగ్రెస్ నాయకులను ప్రతి గ్రామంలో రైతులు నిలదీయాలి. మోటార్లకు మీటర్లు పెట్టమని మెడపై మోదీ కత్తి పెట్టారు. అయినా.. మోటార్లకు మీటర్లు పెట్టకుండా కేంద్రం నుంచి వచ్చే రూ.30వేల కోట్లు వదులుకున్నాం. పంజాబ్‌కు దీటుగా ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నంబర్ 1 స్థానంలో ఉంది" అని మంత్రి కేటీఆర్ వివరించారు.



## ప్రధాని సభలో యువతి హల్‌చల్.. సర్దిచెప్పిన మోదీ

హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన ఎస్సీ ఉప కులాల విశ్వరూప మహాసభలో పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై మోదీ ప్రసంగిస్తున్న సమయంలో ఓ యువతి.. తీవ్ర భావోద్వేగానికి గురై సభా ప్రాంగణంలో ఉన్న ఫ్లడ్‌లైట్ స్తంభం ఎక్కారు. ఇది గమనించిన మోదీ.. "తల్లీ కిందకు దిగాలి.

ఇది మంచిది కాదు. నేను మీతో ఉన్నాను. నేను నీ మాట వింటాను. ఇలా చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. నేను మీకోసమే ఇక్కడికి వచ్చాను. మీరు మందకృష్ణ మాట వినాలి" అని విజ్ఞప్తి చేశారు. ప్రధాని పలుమార్లు సూచించడంతో యువతి స్తంభంపై నుంచి కిందకు దిగింది. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత మోదీ తన ప్రసంగం కొనసాగించారు.

## తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు




విజయవాడ: తెలంగాణ ప్రజలు ప్రభుత్వ మార్పు కోరుకుంటున్నారని, నిన్న (శుక్రవారం) తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని అక్కడ కాంగ్రెస్ వేవ్ నడుస్తోందని.. తెలంగాణ ప్రజలు సోనియా గాంధీపై విశ్వాసంతో ఉన్నారని, కాంగ్రెస్ విజయం ఖాయమని కర్నాటక డిప్యూటీ సిఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. శనివారం విజయవాడ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏపీలో కూడా ఏదొకరోజు తప్పకుండా అధికారంలోకి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తప్పకుండా ఏపీ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని, నేటి కార్యకర్తలే రేపటి నాయకులు, మంత్రులు అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో అందరూ ఇలా ఎదిగిన వారేనని, కుర్చీ కావాలంటే కుర్చీ కోసం పోరాడాలని శివకుమార్ వ్యాఖ్యానించారు. పని చేసేవారిని జాగ్రత్తగా చూసుకుంటే పార్టీ బలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ చరిత్ర దేశ చరిత్రని.. పాలిటిక్స్‌లో ఎవరూ శాశ్వతం కాదని, రాజధాని అంశం, ప్రత్యేక హెూదా, అభివృద్ధి అంశాలపై కాంగ్రెస్ ఏపీకి కమిట్‌మెంట్ ఇచ్చిందన్నారు. జాతీయ పార్టీలు యాక్టివ్‌గా లేకపోవడం.. ఏపీలో అభివృద్ధి లేకపోవడానికి కారణంగా పేర్కొన్నారు. ఇండియా కూటమిగా కాంగ్రెస్‌తో 26 పార్టీలు కలిసి పని చేస్తాయన్నారు. 2024 ఎన్నికలలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కారణంగా దేశం సంయుక్తంగా ఉందని, నమ్మకాన్ని కోల్పోవద్దని, సమస్యలపై పోరాడాలని, కలిసి, ఆలోచించి, పనిచేయాలని.. అదే గెలుపుకు కారణమని డీకే శివకుమార్ అన్నారు.

## కేసీఆర్... ఇదిగో నీ అఫిడవిట్.. ధరణిపై ఇప్పుడేమంటావ్?

కరీంనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ నేత బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ధరణి పోర్టల్‌పై మాట్లాడుతూ... "ధరణి తప్పుల తడకని నువ్వే చెప్పుకున్నవ్ కదా. కేసీఆర్....ఇదిగో నీ అఫిడవిట్. నీ భూమి రికార్డుల్లోనే గుంట భూమిని ఎక్కువగా చూపింది. మరి ఇప్పుడేమంటావ్.. నువ్వే పెద్ద సన్నాసివని ఒప్పుకుంటావా. ధరణి పోర్టల్ రైతులను అరిగోస పెడుతుందని అంగీకరిస్తావా" అని ప్రశ్నించారు. తానతే సీఎం అవుతానని చెప్పనని తెలిపారు. ఎమ్మెల్యేల అభిప్రాయాల మేరకు పార్టీ అధిష్టానమే సీఎం అభ్యర్థిని ప్రకటిస్తుందని.. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తి సీఎం కావడం తథ్యం అని స్పష్టం చేశారు. హైకమాండ్ ఇదే విషయాన్ని ప్రకటించిందన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో ఇమేజ్ లేనేలేదన్నారు.



బీఆర్ఎస్‌ను ఓడగొట్టేది బీజేపీయే అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ డబ్బు సంచులు పంపుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు.

## హైదరాబాద్‌లో మా లక్ష్యం, స్వప్నం అదే: మంత్రి కేటీఆర్



హైదరాబాద్: ఉమ్మడి ఏపీలో విద్యుత్, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉండేవని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణలో గతంలో తరచూ విద్యుత్ కోతలు, తాగునీటి కోసం నిరసనలు జరిగేవని చెప్పారు. హైదరాబాద్‌లో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "మిషన్ భగీరథ ద్వారా హైదరాబాద్‌లో తాగునీటి సమస్య లేకుండా చేశాం. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. హైదరాబాద్‌లో కాలుష్య రహిత ప్రజా రవాణా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. నగరంలో 24 గంటల తాగునీటిని అందించాలన్నదే మా స్వప్నం. మెట్రోను రాబోయే 10 ఏళ్లలో 415 కి.మీ విస్తరించాలన్నదే మా ఎజెండా" అని మంత్రి కేటీఆర్ తెలిపారు.




మునుగోడు: కాంగ్రెస్ పార్టీకి దివంగత రాజ్యసభ సభ్యుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె, మునుగోడు కీలక నేత పాల్వాయి స్రవంతి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ నాలుగు పేజీల లేఖను అధిష్టానానికి పంపారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డిని ప్రకటించడంతో ఆమె పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరిగింది. ఈ వార్తలు అవాస్తవమని ఇటీవల పాల్వాయి స్రవంతి కొట్టిపారేశారు. తాను కాంగ్రెస్‌లోనే ఉంటానని చెప్పారు. ఇంతలోనే ఆమె కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం గమనార్హం. కాగా, మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పాల్వాయి స్రవంతి బరిలో నిలిచిన సంగతి తెలిసిందే.

**ప్రెస్‌మీట్‌లో భావోద్వేగం :** కాంగ్రెస్ పార్టీ పదవులకు రాజీనామా చేసిన నేపథ్యంలో స్రవంతి భావోద్వేగానికి గురయ్యారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. "నా రాజీనామా లేఖను సోనియా గాంధీకి పంపించా. పార్టీని వీడేందుకు దారితీసిన పరిస్థితులు, నాయకత్వం తీరుపై లేఖలో వివరించాను. కొంతకాలంగా పదవులు, టికెట్ల కేటాయింపుల్లో అవకతవకలు జరుగుతున్నాయి. కాంగ్రెస్‌ను వీడాల్సి రావడం బాధగా ఉంది. మా తండ్రి 60 ఏళ్లపాటు కాంగ్రెస్‌తో ప్రయాణం చేశారు. వివిధ హెూదాల్లో పార్టీకి సేవలందించారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో ఆయన పాత్ర చాలా గొప్పది.

**కాంగ్రెస్ కార్పొరేట్, బ్రోకర్ పార్టీగా మారిపోయింది :** కాంగ్రెస్ కార్పొరేట్, బ్రోకర్ పార్టీగా మారిపోయింది. కాంగ్రెస్ చచ్చిపోయిందని పార్టీని వీడి వెళ్లిన రాజగోపాల్ రెడ్డి మళ్లీ వస్తే కండువా కప్పారు. 24 గంటల్లో మునుగోడు టికెట్ ప్రకటించారు. ఉప ఎన్నికలో పోటీ చేసి ఓటమి పాలైన తర్వాత పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్న నాకు కనీసం మాట కూడా చెప్పలేదు. పీసీసీ అధ్యక్షుడు స్థానంలో ఉన్న వ్యక్తి అన్నీ తుంగలో తొక్కేశారు. ప్రజా పక్షాన నిలబడేది భారాస అని భావిస్తున్నా. మంత్రి జగదీశ్ రెడ్డి మా ఇంటికి వచ్చి భారాసలోకి ఆహ్వానించారు. దీనిపై రేపో మాపో నిర్ణయం వెల్లడిస్తా" అని వెల్లడించారు.

## దీపావళి తర్వాత భాజపా ఎన్నికల మేనిఫెస్టో : కిషన్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేందుకు భాజపాకు అవకాశం ఉందని కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. దీపావళి పండగ తర్వాత పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనున్నట్లు చెప్పారు. భాజపా అగ్రనేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. "భాజపా, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అంటున్నారు. ఎంఐఎం పార్టీతో భాజపా కలిసే అవకాశమే లేదు. కాంగ్రెస్, భారాస పార్టీలు భాజపాపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయి. మజ్లిస్ పార్టీతో కలిసి లాభపడింది కాంగ్రెస్ పార్టీయే. భారాస పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. కేవలం ఐదు నెలల్లోనే కర్ణాటకను కాంగ్రెస్ భ్రష్టు పట్టించింది" అని కిషన్ రెడ్డి విమర్శించారు.

## చంద్రమోహన్ మృతి బాధాకరం...




హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్ మృతి బాధాకరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. విభిన్నమైన పాత్రలలో తన విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని పొందారని కొనియాడారు. ఆయన మృతి తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు తెలుగు ప్రేక్షకులకు తీరని లోటని అన్నారు. చంద్రమోహన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానని, వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని కోరుతూ ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి తలసాని అన్నారు. సీనియర్ నటుడు చంద్రమోహన్ (82) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం 9.45 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య జలంధర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కృష్ణాజిల్లాలోని పమిడిముక్కల గ్రామంలో 1943 మే, 23 జన్మించిన చంద్రమోహన్ 'రంగుల రాట్నం' చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. హీరోగా, కమెడీయన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా 900లకు పైగా చిత్రాల్లో నటించి మెప్పించారు.

హీరోగా సుమారు 175 సినిమాలకు పైగా చేశారు. కామెడీ పాత్రల ద్వారానే ఆయన ప్రత్యేకమైన గుర్తింపును పొందారు. గోపీచంద్ హీరోగా తెరకెక్కిన 'ఆక్సిజన్' ఆయన నటించిన చివరి చిత్రం.




రంగారెడ్డి: రాజేంద్రనగర్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటనలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. అగ్నిప్రమాదానికి ముందు ఓ యువకుడు క్రాకర్స్ దుకాణం వద్ద సంచరించినట్లు సీసీ కెమెరాలో గుర్తించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

రాజేంద్రనగర్‌లో సన్‌సిటీ వద్ద క్రాకర్స్ దుకాణంలో శనివారం వేకువజామున భారీగా మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న దుర్గా భవాని ఫుడ్‌జోన్‌కూ మంటలు వ్యాపించడంతో అందులో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది.

ఈ ప్రమాదంలో మరో మూడు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం నాలుగు దుకాణాల నుంచి మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. దాదాపు 4 గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## ఎవరికి ఎటువంటి డౌట్ లేదు.. మళ్లీ కేసీఆరే సీఎం



కురవి(మహబుబాబాద్): అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా నిలిపిన కేసీఆర్ రానున్న ఎన్నికల్లో మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత జోస్యం చెప్పారు. కురవిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 21వ తేదీన కురవిలో సీఎం కేసీఆర్ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. గిరిజనులకు ప్రత్యేక గ్రామపంచాతీలను ఏర్పాటు చేసిన కేసీఆర్, ఎంతో మంది గిరిజనులు సర్పంచులు, ప్రజాప్రతినిధులుగా అయ్యేందుకు అవకాశం కల్పించారన్నారు.

ఈనెల 11న హైదరాబాద్ శామీర్‌పేటలో రాష్ట్రస్థాయి గిరిజన సదస్సు ఏర్పాటు చేస్తున్నామని, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు రైతుబీమా, పెట్టుబడి సాయం అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక తెల్లరేషన్‌కార్డు కలిగివున్న 93 లక్షల మందికి ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిస్తుందన్నారు.

## త్వరలో కాంగ్రెస్‌లోకి విజయశాంతి: మల్లురవి



హైదరాబాద్: విజయశాంతి కాంగ్రెస్ పార్టీలో చేరతారని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడో, రేపో ఆమె కాంగ్రెస్ గూటికి వస్తారన్నారు. ప్రస్తుతం విజయశాంతి భాజపాలో ఉన్న విషయం తెలిసిందే. కానీ, ఎన్నికల సమయంలో కూడా ఆమె పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదు. దీంతో గత కొన్ని రోజులుగా విజయశాంతి పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే భాజపా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com